Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)

జమీన్‌రైతు
పొగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి
Longest Living Newspaper in Telugu Journalism
జమీన్‌రైతు
సంపుటి: 83 • సంచిక: 41 • 11-10-2013 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-



ప్రజల మధ్య కొట్లాట పరమ నీచం!

సమైక్యాంధ్ర ఉద్యమం హద్దులు మీరుతున్నది. పరిధులు దాటుతున్నది. రాష్ట్ర విభజనపై ముఖ్యమంత్రికి కానీ, ఉద్యోగ సంఘాలకు కానీ, ఇతర వర్గాలకు కానీ స్వంత అభిప్రాయాలు వుండవచ్చు. వాటికి అనుగుణంగా ఉద్యమం చేయవచ్చు. అది ప్రజాస్వామ్య లక్షణం. కానీ స్వేచ్ఛకు కూడా కొన్ని పరిమితులున్నాయి. ఉద్యమకారులు, వారిని వెనక నుంచి నడిపిస్తున్నవారు ఆ గీత దాటుతున్నారు.


రాష్ట్ర విభజన మీద తెలంగాణలో ఎన్నో ఏళ్లుగా ఆందోళన నడుస్తున్నది. అక్కడ ఉద్యోగులు సమ్మె చేశారు. బందులు, రాస్తారోకోలు, వంటావార్పులు చేశారు. మానవ హారాలు ప్రదర్శించారు. కానీ ఆ ఆందోళన కార్యక్రమాలు తమ అభిలాషను ప్రభుత్వానికి తెలియజెప్పడం అనే లక్ష్యం కోసం మాత్రమే నడిచాయి. కానీ ఆంధ్రలో నడుస్తున్న ఉద్యమం మాత్రం ప్రజలను శిక్షించే పోకడతో నడుస్తున్నది. సామాన్యుడి జీవితాన్ని చిందర వందర చేసే తీరులో జరుగుతున్నది. విద్యుత్ ఉద్యోగుల సమ్మె దీనికి పరాకాష్ట. ఐదు రోజులుగా వారు అటు ఉత్పత్తి కేంద్రాలను, ఇటు పంపిణీ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారు. రాష్ట్రమంతా చీకట్లు అలముకొనే దుర్గతి పట్టిస్తున్నారు. దానివల్ల సగటు మనిషి పడే బాధను పట్టించుకోవడం లేదు. ఆస్పత్రులలో రోగులు అల్లాడిపోతున్నారు. ఆపరేషన్ థియేటర్లు పనిచేయక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. గుండె, కాలేయం, కిడ్నీ వంటి ఆపరేషన్లు చేయించుకొన్న రోగులకు ఆక్సిజన్ సరఫరా, హృదయ చలనం నియంత్రించే మానిటర్లు వంటివి తప్పనిసరి. కానీ కరెంట్ లేక పోవడంతో అవి పని చేయడం లేదు. అత్యవసర శస్త్ర చికిత్సలు జరగడం లేదు. గ్రామాలలో మంచి నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఎదురౌతున్నది. రైళ్లు సక్రమంగా నడవక వేలాది మంది ప్రయాణీకులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. పరిశ్రమలు మూతపడి పోతున్నాయి. బ్యాంకులు మూత పడడంతో వ్యాపారాలు స్తంభిస్తున్నాయి.

సమైక్య రాష్ట్రం పేరుతో ప్రజలను ఇన్ని రకాలుగా ఇబ్బంది పెట్టే అధికారం ఉద్యోగ సంఘాలకు ఎవరు ఇచ్చారు? మన రాష్ట్రంలో ఉద్యమాలు కొత్త కాదు. జై ఆంధ్రా, విశాఖ ఉక్కు వంటి ఉద్యమాలు ఇంతకంటే తీవ్రంగా నడిచాయి. కానీ సమైక్య ఉద్యమం మాత్రం అరాచక పోకడలో సాగుతున్నది.

దీనికి బాధ్యుడు ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి. ఆయన తీరు ఎవరికీ అర్థం కావడం లేదు. రాష్ట్ర విభజన ఇష్టం లేకుంటే, తన చేతులతో ఆ పాపం చేయకూడదనుకొంటే, పదవి నుంచి పక్కకు తప్పుకోవాలి. రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొ

కొరవ 14వ పేజీలో

అయోమయంలో చంద్రబాబు!



చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితం సమస్తం ఒడిదుడుల మయం, రాజకీయాలలో ఆయన ఎదుర్కొన్నన్ని సవాళ్లు మన రాష్ట్రంలో మరే నేతకూ అనుభవం కాలేదు. ఎన్టీఆర్‌తో పోలిస్తే చంద్రబాబు పిపీలకం వంటివాడు. మహోజ్వలమైన ప్రజాభిమానం ఎన్టీఆర్ స్వంతం. ఆయనది అద్భుతమైన ఉపన్యాసకళ. తన మాటలతో జనాన్ని మైమరపింప చేయడం ఆయనకు దేముడిచ్చిన వరం. ఒక వర్గం జనం దృష్టిలో ఆయన దేముడితో సమానం. పైపెచ్చు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎన్టీఆర్ చేసిన నిర్ణయాలన్నీ విప్లవాత్మకమైనవి. బిసిలకు రాజ్యాధికారం ఆయన పుణ్యమే. రెండు రూపాయలకు కిలో బియ్యం ఆనాటి పరిస్థితులలో పేదవాడికి గొప్ప ఉపకారం. మహిళలకు రాజకీయ పదవులు ఆయనిచ్చిన కానుక. పరిపాలనాపరంగా మండలాల ఏర్పాటు, గ్రామ కరణాల వ్యవస్థ రద్దు వంటివి జనాన్ని ఎంతగానో మెప్పించాయి. మేరునగ ధీరుడు వంటి ఎన్టీఆర్‌ను పక్కకు తప్పించి చంద్రబాబు అధికారం చేపట్టడం కొండతో ఢీ కొని పొట్టేలు గెలవడంతో సమానం. రాజకీయ స్థాయి, ప్రజాబలం లేకుండా ఆ అధికారాన్ని నిలబెట్టుకోవడంలో చంద్రబాబు ఎన్నో కఠినమైన సవాళ్లను ఎదుర్కొన్నాడు. నెగ్గుకొని కూడా వచ్చాడు. జాతీయ స్థాయిలోనే రాజకీయ వ్యూహ కర్తగా ప్రతిష్ట సంపాదించాడు.

అటువంటి చంద్రబాబు ఇప్పుడు పడుతున్న అవస్థ చూస్తుంటే జాలి కల్గుతున్నది. రాష్ట్ర విభజన పట్ల తన విధానం ఏమిటో తనకే తెలియని అయోమయ స్థితిలో ఆయన వేస్తున్న కుప్పిగంతులు చూస్తే అయ్యో పాపం అన్పిస్తున్నది. ఇప్పటికే రెండుసార్లు అధికారానికి దూరమైన పార్టీ ఆయనది. పదేళ్లపాటు ప్రతిపక్షంలో వుంటూ పార్టీని నిలబెట్టుకోవడం కత్తి మీద సాముతో సమానం. రేపు జరగబోయే ఎన్నికలలో మరొకసారి ఓటమి ఎదురైతే, తెలుగుదేశం పార్టీ అస్థిత్వమే అనుమానంలో పడుతుంది. కానీ గత రెండు ఎన్నికల కంటే రేపటి ఎన్నికలో తెలుగు దేశం మరింత గడ్డు పరిస్థితి ఎదుర్కోక తప్పదని అర్థమై పోతున్నది. వైఎస్ జగన్ ప్రభావం వారిని కలవర పరుస్తున్నది.

ఈ నేపథ్యంలో రాష్ట్ర విభజన అంశం తెర మీదకు రావడం చంద్రబాబు నాయుడు దురదృష్టం. ఎంతో వూగిసలాటల తర్వాత తెలంగాణ ఏర్పాటుకు అభ్యంతరం లేదని లేఖ ఇచ్చాడు. అప్పటికి ఆంధ్ర ప్రాంతంలో రాష్ట్ర విభజనపై కనీసపాటి చర్చ కూడా లేదు. రాష్ట్రం విడిపోయినా ప్రజలు పట్టించుకోరనే భావనతో తెలంగాణ అనుకూల నిర్ణయం తీసుకొన్నాడు. కానీ వూహకందని రీతిలో సమైక్యాంధ్ర ఉద్య

కొరవ 14వ పేజీలో



ప్రజల తిరుగుబాటు

సమైక్యాంధ్ర ఉద్యమం విజయనగరం పట్టణంలో సృష్టించిన భీతావహ పరిస్థితి ఆశ్చర్యకరమైనది. రాష్ట్రంలోని అత్యంత ప్రశాంతమైన జిల్లాలలో విజయనగరం ఒకటి. అక్కడి ప్రజలు శాంతి కాముకులు. అల్లర్లు, ఆందోళనలకు బహుదూరం. గజపతి రాజుల కాలం నుంచి అదే వాతావరణం. సాహిత్యం, సంగీతాలకు అది పుట్టినిల్లు. గురజాడ నుంచి ఘంటసాల, పి.సుశీల వరకు తెలుగు జాతి గర్వించదగిన లబ్ద ప్రతిష్టులు ఎంతోమంది తమ ప్రతిభకు సానబెట్టుకొన్న మహత్తర భూమి అది. స్వాతంత్ర్య ఉద్యమంలో కానీ, దేశ విభజన జరిగినపుడు కానీ, ఆ తర్వాత వచ్చిన జై ఆంధ్ర, విశాఖ ఉక్కు వంటి ఉద్యమాల సమయంలో కానీ, మరే సందర్భంలో కానీ అక్కడ శాంతికి విఘాతం కలగలేదు. పొరుగునే వున్న శ్రీకాకుళంలో, ఒరిస్సా సరిహద్దులో నక్సల్బరీ ఉద్యమం మహోధృతంగా నడిచినప్పుడు కూడా విజయనగరంలో అశాంతి లేదు.

అటువంటి వూరు, ఆరు రోజుల పాటు కర్ఫ్యూ పడగ నీడలో కాలం గడపవలసి రావడం నిజంగా ఆశ్చర్యకరం. సమైక్యాంధ్ర ఉద్యమం ఉగ్ర రూపం ధరించి, విజయనగరం పట్టణాన్ని కాకెక్కించింది. టీవీలలో ఆ దృశ్యాలు చూస్తుంటే అది ఉద్యమం వలె కన్పించలేదు. ప్రజల తిరుగుబాటు అంటే ఎట్లా వుంటుందో కళ్ల ముందు కదలాడింది. విజయనగరం జిల్లాలో గత పదిహేనేళ్లుగా పిసిసి అధ్యక్షుడు బొత్సా సత్తిబాబు రాజకీయ పెత్తనం చేస్తున్నాడు. ఆయనది ఉక్కు పిడికిలి. జిల్లాలోని రాజకీయ పదవులన్నీ తన కుటుంబానికే పరిమితం. ఆయన భార్య ఎమ్మీ, ఆయన మంత్రి, ఆయన తమ్ముళ్లు ఎమ్మెల్యేలు. మరొకప్రక్క ఆ వూరులో ప్రతి వ్యాపారమూ బొత్సా కుటుంబం చేతుల మీదుగానే నడుస్తున్నాయి. హోటల్ వారిదే, కేబుల్ టీవీ వారిదే, బ్రాందీ షాపులు వారివే, స్కూళ్లు వారివే, ఇంజనీరింగ్ కాలేజీ వారిదే, ఇసుక అక్రమ రవాణా వారిదే. ఇదీ అదీ అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఊళ్లో ఎవరు ఏ వ్యాపారం చేయాలన్నా బొత్సా అనుచరులతోనో, బంధువులతోనో భాగస్వామ్యం తప్పదు.

రాజకీయానికి ఆర్థిక లావాదేవీలు కలగలసి ఒక కుటుంబ గుప్పెట్లోకి వెళ్లడం ప్రజలకు అసంతృప్తి కల్గించడం చాలా సహజం. అయితే అది ఆగ్రహంగా మారడం మాత్రం ఆశ్చర్యకరం. బొత్సా ఆస్తుల మీద ప్రజలు విరుచుకపడ్డారు. వారి అనుచరులన్న వారు కూడా వూరు విడిచిపారి పోయే పరిస్థితి కల్పించారు. పోలీసు లాఠీలను లెక్క చేయలేదు. బాష్ప వాయు గోళాలను ఆడుకొనే బంతుల వలె ఒడిసి పట్టుకొన్నారు. చివరకు కర్ఫ్యూ పెట్టినా ఏ మాత్రం వెరపు లేకుండా వీధులలోకి వచ్చి పోలీసులకు సవాళ్లు విసిరారు. ఎక్కడో కడప, కర్నూలు వంటి ఫ్యాక్షన్ నేపథ్యం వున్న వూళ్లలో జనం పోలీసుల మీద తిరగబడడం వేరు. విజయనగరంలో అది జరగడం వేరు. కేవలం సమైక్యాంధ్ర కోరిక అయితే వారిలో ఇంతటి ఆగ్రహావేశాలు చెలరేగే అవకాశం లేదు. స్థానిక రాజకీయాల మీద విసుగు, కోపం, విరక్తి ఈ తిరుగుబాటుకు దారి తీశాయి అని ఒప్పుకోక తప్పదు.

జమీన్‌రైతు

రాజకీయ అధికారం అంటే, రాజుల కాలం నాటి నిరంకుశం అని భ్రమపడుతున్న రాజకీయవాదులందరికీ ఈ ఉదంతం ఒక హెచ్చరికగా భావించాలి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజకీయాన్ని దోపిడీకి మార్గంగా వ్యవస్థీకరించాడు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు అందినంత ప్రజాధనాన్ని జవురుకోవడాన్ని ప్రోత్సహించాడు. పోను పోను వారికది ఒక వ్యసనంగా మారిపోయింది. రెవిన్యూ, మునిసిపల్, పోలీసు, ఎక్సైజ్, పిడబ్ల్యుడి వంటి శాఖలను తమ గుప్పెట్లో పెట్టుకొని అడ్డమైన పనులు చేస్తున్నారు. అది తమ హక్కుగా భావిస్తున్నారు. ప్రజలు తమకు కప్పం కట్టాలన్నట్లు ప్రవర్తిస్తున్నారు. ఒక్క విజయనగరంలోనే కాదు, రాష్ట్రం మొత్తం మీద ఇదే పరిస్థితి. అన్ని చోట్లా ప్రజలలో ఇటువంటి ఆగ్రహమే వుంది. విజయనగరంలో అది తిరుగుబాటు రూపంలో వ్యక్తమైంది. అవకాశం వస్తే ప్రతి వూరిలోనూ కాంగ్రెస్ వాదులకు ఇటువంటి చేదు అనుభవాలు తప్పవని చెప్పక తప్పదు. విజయనగరం ఉదంతాలు చూసిన తర్వాత అయినా రాజకీయవాదులు కళ్లు తెరవడం మంచిది.

జనవాక్కు

ఎరగడ్డల ధరలు అదుపులోకి తెండి!

ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వేడితోపాటు ఎరగడ్డల ధరల ఘాటుకు విని యోగదారులు బెంబేలెత్తుతున్నారు. నెల్లూరులో కిలో ఎరగడ్డలు 65 రూపాయ లమ్ముతున్నారు. ఎరగడ్డల ధరలు ఇంతగా పెరగడం గతంలో ఎన్నడూ చూడ లేదు. గతంలో ఎరగడ్డల ధరలు పెరిగి కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఎన్నికల్లో అపజయాన్ని చవిచూసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు ప్రజలందరికీ అందించ లేకపోతున్నాయి. తరచూ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతున్నారు. జిలకర మసూరి రకం బియ్యం కిలో 50 రూపాయలుగా అమ్ముతున్నారు. పప్పులు, వంట నూనెలు, కూరగాయలు మునుపెన్నడూలేని విధంగా పెరిగాయి. ప్రభుత్వాలు ఈ ధరలను తగ్గించాల్సిన బాధ్యత చేపట్టాలి.

పి.అరుణకుమారి *నెల్లూరు*

ముఖ్యమంత్రి అభినందనీయుడు!

రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వుంటూ సమైక్య వాదానికి అండగా నిలిచిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అభినందనీయుడు. ఈ విషయంలో తెలంగాణ కాంగ్రెస్ వాదులు, తెరాస నేతల నుంచి విమర్శలు వస్తున్నా సమైక్యాంధ్ర కోసం గళం విప్పిన ముఖ్యమంత్రి ధైర్యవంతుడే. కాంగ్రెస్ అధినేత్రి శ్రీమతి సోనియాగాంధీ మొదలు పార్టీ అగ్రనేతలంతా తెలంగాణకు అనుకూలంగా ఉన్నా ఇవన్నీ లెక్క చేయక ముఖ్యమంత్రి సమైక్య శంఖం పూరించి హీరోగా నిలిచారు. రాష్ట్రంలో మెజార్టీ ప్రజలు సమైక్యాంధ్ర ప్రదేశ్‌ను కోరుకొంటున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ అధిష్టాన దేవతలు తెలుసుకొంటే బాగుంటుంది.

పందిళ్లపల్లి అరుణమ్మ *నెల్లూరు*

గందరగోళం

రాష్ట్రంలో ఏ ఆస్తికి సంబంధించిన రిజిస్ట్రేషన్ అయినాసరే రాష్ట్రంలోని మరే ఇతర సబ్ రిజిస్టారు కార్యాలయంలోనైనా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు అనే ఉత్తర్వు సమంజసం కాదు. ఎన్‌కమ్‌బెన్స్ సర్టిఫికేట్ కోరుతున్న వారు రిజిస్ట్రేషన్ జరిగిన కార్యాలయానికే వెళ్లాలా లేక వారి దగ్గరలో వున్న కార్యాలయం నుండి పొందవచ్చా అన్నది తేలలేదు. ఒకవేళ రిజిస్ట్రేషన్ ఇంకొక కార్యాలయంలో జరిగి వుంటే దానికి మరొక కార్యాలయంలో ఎన్‌కమ్‌బెన్స్ సర్టిఫికేట్ ఇవ్వడం సరియేనా? దీనిపై మరింత స్పష్టత అవసరం.

పి.రమణయ్య *కోవూరు*

షాపింగ్ కాంప్లెక్స్‌కు అనుమతి ఎలా ఇస్తారు!

నెల్లూరు దర్గామిట్టలోని కెవిఆర్ పెట్రోల్ బంకు దగ్గర నియమనిబంధన

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

15-10-1943
పేజీలు:6 వెల: 0-1-6అణా

మద్రాసుపై జపాన్ బాంబులు

ఈ 11వ తేది రాత్రి పూట ఒకే ఒక జపాన్ పర్యవేక్షణ విమానం మద్రాస్ నగరం మీదకు వచ్చి కొన్ని బాంబులు వేసింది. మిలటరీ నష్టం లేదు. సివిలియన్ నష్టాలు మాత్రం కొద్దిగా ఉన్నాయి.

నగరాన్ని ఖాళీ చేసి పోవాలనే గందరగోళంలో పడకుండా, పట్టణం ప్రశాంతంగా జీవితం గడుపుతున్నది అని ప్రభుత్వ ప్రకటన.

అదే రాత్రి సిలోన్ తూర్పు కోస్తా ప్రాంతాన ఒక జపాన్ విమానం బాంబులు వేయకముందే పడగొట్టబడింది.

మద్రాస్‌లో వరదలు

15 రోజులుగా విపరీతమైన వర్షాలు కురిసినందుకు మద్రాస్ నగరం చాలా భాగం జలమయమైంది. కొన్ని పేటలలో మొలలోతు నీళ్లున్నాయి. రోడ్ల మీద అడయార్, కూమ్ నదుల గట్లు పొంగి వరదలు వచ్చిపడ్డాయి. ఈ వరదల మూలాన పేదవారి గుడిసెలెన్నో పోయినాయి. కేవలం నిరాధారులగు వారికి అన్నదానం జరుపుతున్నారు.

ఈ వరదలు, వర్షాల మూలంగా సిటీలో ప్రయాణ సౌకర్యాలు వగైరాలన్నీ నిల్చిపోయాయి గూడా. ప్రస్తుతం ఆ చిక్కంతా తీరి పోతున్నది. పరిస్థితి తీవ్రత తగ్గిపోతుంది. మద్రాస్‌లో వర్షాల మూలంగా ఇండ్లు కూలి 12గురు మరణించారు.

50 ఏళ్ల క్రితం ఈవారం

11-10-1963
పేజీలు: 12 వెల: 0-20 న.పై

నెల్లూరులో స్థానంకు సన్మానం!

ఆంధ్ర నాటక కళారంగమున స్త్రీ పాత్ర పోషణలో తన అసమాన నటనా ప్రతిభతో మహోన్నత శిఖరాలపై కీర్తి పతాక నెగురవేసిన నటకావతంస, పద్మశ్రీ స్థానం నరసింహారావు గారిని శ్రీ సింహపురి యువజన నాట్య మండలి 6వ తేది సాయంకాలం నెల్లూరులో ఘనంగా సన్మానించింది. ఆంధ్రప్రదేశ్ సంగీత కళాపరిషత్తు అధ్యక్షులు ఆర్.బి.రామకృష్ణరాజు అధ్యక్షత వహించారు. నాటి సాయంకాలం శ్రీ స్థానం, శ్రీ రామకృష్ణ రాజు గారలు పుర మందిర ప్రాంగణంలో అడుగుపెట్ట గానే మంగళ వాద్యాలతో, వేదాధ్యయంతో స్వాగతమివ్వబడి, హాలుకు గొంపోబడినారు. సింహపురి యువజన నాట్య మండలి అధ్యక్షులు శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డి ఆహూతులకు స్వాగతం చెప్తూ; స్థానం వారిని స్త్రీ రూపంలో ఈ వేదిక మీద చూచే అవకాశం తనకు పెక్కు పర్యాయములు కలిగిందని, స్త్రీయే ఆ పాత్ర ధరించిందా అనేంతటి భ్రాంతి తనకు కలిగిందని, స్థానం అంతటి ప్రజ్ఞావంతుడని చెప్తూ, అటువంటి మహోన్నత నటుని సన్మానించే భాగ్యం తనకు కలిగినందుకు తాము గర్విస్తున్నామని, ఇది నెల్లూరు నగరం కూడా గర్వించదగిందని అన్నారు.

అన్నదాత విందు

గవర్నమెంటు ప్లీడరుగా నియమింపబడిన తన మిత్రుడు పి.వి.రమణారెడ్డి అభినందనార్థం, న్యాయవాది అన్నదాత మాధవరావు 1వ తేది సాయంకాలం రామమూర్తినగర్‌లోని తన గృహంలో అల్పాహార విందు జేశారు. అతిథుల సంఖ్య పరిమితంగా, పదార్థముల సంఖ్య అపరిమితంగా, స్నేహాదరముల విలువ రెంటికంటే రెట్టింపుగా వుండి ఆనాటి రాత్రి భోజనం అవసరం లేకుండా పోవడం అన్నదాత వారి అల్పాహార విందు విశేషాలు.

నెల్లూరు ముచ్చట్లు

ఎటో వెళ్లి పోయారు!

నెల్లూరులో ఉద్యోగుల జెఏసి తరపున 55 రోజులపాటు సమైక్య ఉద్యమానికి సారథ్యం వహించి నడిపిన ఎజెసి చల్లా పెంచలరెడ్డి, డిఆర్వో రామిరెడ్డి గత పది రోజులుగా ఉద్యమంలో కనిపించడం లేదు. విషయమేమిటని ఆరా తీస్తే వీరిద్దరికి జిల్లాలో ఉద్యమ ఉధృతి తగ్గించమని ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నుంచి ఫోన్ వచ్చినట్లు తెలిసింది. దీంతో ఈ అధికారులిద్దరూ సైడ్ అయిపోయారు. ఈ ఇద్దరు అధికారులకు ఆనమోళ్ల మనుషులనే పేరుంది. దీనికి తగ్గట్టే వారు ప్రవర్తించారంటున్నారు ఉద్యోగులు. మరి దీనికి ఆ ఇద్దరు ఏమంటారో?

డిగ్గీ రాజా కాదు బ్లడీ రాజా!

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డికి నోరెక్కువన్నది నెల్లూరీయులందరికీ తెలుసు. ఆయన విమర్శల బారి నుంచి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల పరిశీలకుడు దిగ్విజయ్ సింగ్ కూడా తప్పించుకోలేక పోయారు. 8వ తేది ఎసి సెంటర్‌లో వివేకానందరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సీమాంధ్రుల మనోభావాలను గౌరవించకుండా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న ఆయన డిగ్గీ రాజా కాదు బ్లడీ రాజా అన్నారు. ఆయన్ను ఆంధ్రప్రదేశ్ బాధ్యతల నుంచి తొలగించాలన్నారు. సమైక్యాంధ్ర కోరుతూ దీక్ష చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానన్నారు. మరుభూమిని ఏలుకోవాలని ఆనం రామనారాయణరెడ్డి కోరుకోవడం లేదని ఆయన ముఖ్యమంత్రిత్వంపై అడిగిన ఒక ప్రశ్నకు వివేకానందరెడ్డి జవాబు చెప్పారు.

విద్యుత్ సమ్మెకు పురుడుపోసిన నెల్లూరు!

సారా వ్యతిరేక ఉద్యమం, పొదుపు ఉద్యమం, అక్షరాస్యత ఉద్యమాలకు పురుడు పోసిన సింహపురి సీమలో ప్రస్తుతం జరుగుతున్న సమైక్యాంధ్ర ఉద్యమంలో విద్యుత్ సమ్మె మొదలవ్వడానికి నెల్లూరులో పోలీసులకు విద్యుత్ ఉద్యోగులకు జరిగిన చిన్నపాటి ఘర్షణ కారణమయ్యిందని చెప్పక తప్పదు. సమైక్య ఉద్యమంలో భాగంగా నెల్లూరు విద్యుత్ భవన్ వద్ద రోడ్డుపై ఓ మొద్దును కాల్చను విద్యుత్ ఉద్యోగులు పూనుకొన్నారు. పోలీసులొచ్చి ఇక్కడ నగర డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి బంగళా ఉందని మరి చారా అని ప్రశ్నించారు. విద్యుత్ భవన్‌నే ముందు కట్టారని ఉద్యోగులు వాదనకు దిగడం అది చిలికి చిలికి గాలి వానగా మారి ఇక్కడ జరిగిన నిరసనలో ఐదవ నగర సిఐ పడిపోవడంతో విద్యుత్ ఉద్యోగులపై పోలీసులు లాఠీ ఛార్జి చేశారు. ఈ విషయం తెలుసుకున్న సీమాంధ్ర విద్యుత్ ఉద్యోగుల జెఏసి నాయకుడు నెల్లూరీయుడైన సాయిబాబా హైదరాబాద్ నుంచి హుటాహుటిన 5వ తేది నెల్లూరు వచ్చారు. ఇక్కడే జెఏసి అత్యవసర సమావేశం జరిపిన ఆయన 6వ తేది నుంచి విద్యుత్ ఉద్యోగులు మెరుపు సమ్మె చేస్తున్నట్లు ప్రకటించారు. వాస్తవానికి విద్యుత్ ఉద్యోగుల సమ్మె ముఖ్యమంత్రితో మలి దఫా చర్చల తర్వాత అంటే వారం రోజుల తర్వాత ఉండేది. నెల్లూరులో పోలీసులు విద్యుత్ ఉద్యోగులను కొట్టారన్న బాధతో కాస్త ముందుగానే విద్యుత్ సమ్మెకు సాయిబాబా పురుడు పోశారు. రాష్ట్రవ్యాపితంగా ఒక అలజడి మొదలయ్యేలా చేశారు. సీమాంధ్ర జిల్లాలలో నెల్లూరులోనే విద్యుత్ ఉద్యోగుల జెఏసి బలంగా ఉండడంతో సమ్మె ఉధృతంగా జరుగుతుంది. సీమాంధ్ర జిల్లాలలో చీకట్లు కమ్ముకొనేలా చేసింది.

ఆనం భక్త పరమాణువు ఎడిఇ శ్రీహరి!

విద్యుత్ ఉద్యోగుల మెరుపు సమ్మె నెల్లూరులో పురుడు పోసుకొన్నా ఆ ఉద్యమాన్ని అణచి వేసేందుకు నెల్లూరు ఎడిఇ శ్రీహరి 6వ తేది సాయంత్రం తన వంతు ప్రయత్నం చేసి ఆ శాఖ ఉద్యోగుల చేతిలో తన్నుల నుంచి తప్పించుకొన్నారు. 6వ తేది జిల్లా అంతా విద్యుత్ బంద్ అయిన వేళ సాయంత్రం ఆరు గంటలకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి ఇంటికి కరెంట్ ఇచ్చి ప్రజలు విద్యుత్ సిబ్బందిపై తిరగబడేలా చేశాడు. ఈ ఎడిఇనే తన స్వామి భక్తి చాటే ప్రయత్నంలో వివేకానందరెడ్డి, రామనారాయణరెడ్డి ఇళ్లకు 24 గంటలు విద్యుత్ సరఫరా ఆగకుండా ఉండేలా ప్రత్యేక లైను వేయించాడట. దీనివల్లే శ్రీహరిని నెల్లూరు నుంచి ఎవరూ మార్చలేక పోతున్నారు. అందరూ చీకట్లో వాళ్లు మాత్రం విద్యుత్ వెలుగుల్లో ఉండడం న్యాయమంటారా?

జనంలో అసహనం మొదలు!

సమైక్యాంధ్ర ఉద్యమం మూలంగా బస్సు, రైళ్ల సౌకర్యం లేకపోయినా బ్యాంకులు పనిచేయక పోయినా, ఉద్యమం మూలంగా జనం ట్రాఫిక్‌లో చిక్కుకుపోయినా గత రెండు నెలలుగా అసహనం చూపని ప్రజలు విద్యుత్ ఉద్యోగుల సమ్మెతో విలవిలలాడి పోతున్నారు. ఉక్కపోత, ప్రతి పనికి ఎలక్ట్రిక్ వస్తువులపై ఆధారపడి ఉండడం, కొన్నిచోట్ల మంచి నీటి సౌకర్యం, నీటిని తోడుకొనేందుకు మోటార్లు లేక పోవడంతో జనం నీళ్లులేక విలవిలలాడి పోతున్నారు. విద్యుత్ ఉద్యోగులు త్వరగా సమ్మె ముగించకుంటే సమైక్యాంధ్ర ఉద్యమంలో సరికొత్త సమస్యలు పుట్టడం ఖాయం.

ప్రేక్షకుల్లా పోలీసులు

ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఇళ్ల వద్ద వీర బందోబస్తు మినహా నగరంలో ట్రాఫిక్ ఆగినప్పుడు ఇతర గందరగోళ వ్యవహారాలను సరిదిద్దడంలో విధుల్లో వున్న పోలీసులు తీవ్రంగా విఫలమవుతున్నారు. ప్రతిరోజూ ఏదో ఒక ప్రదర్శనల మూలంగా ట్రాఫిక్ నిలచి జనం నానా పాట్లు పడుతున్నారు. ఎస్పీ రామకృష్ణ సైతం ఇటీవల ట్రాఫిక్‌లో తన కారును ముందుకు కదపలేక విఆర్‌సి సెంటర్‌లో రోడ్డుపై కూడా నడిచి వన్‌టౌన్ సిఐని మందలించాక కూడా పరిస్థితుల్లో మార్పు లేదు. ఇలా అయితే ఎలా సార్?

ఎమ్పీ రాజమోహన్‌రెడ్డికి సమైక్య సెగ

నెల్లూరు ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని 3వ తేది కావలిలో సమైక్యవాదులు అడ్డుకొన్నారు. మీ రాజీనామాను ఎందుకు ఆమోదించుకోలేదంటూ నిలదీశారు. ఎమ్పీగా నందమూరి హరికృష్ణ రాజీనామా ఆమోదింప జేసుకొన్నారు. మీరు ఏం చేశారనగా... ఎమ్పీ నేను పారదర్శకంగా స్పీకర్ ఫార్మేట్‌లో రాజీనామా చేశాను. కానీ లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని తెలివిగా మాట్లాడే ప్రయత్నం చేసినా ఇది మంచి పద్ధతి కాదని సమైక్యవాదులు ఎమ్పీకి హితవు పలికి ముందుకు వెళ్లను దారిచ్చారు.

జ్వరాలతో యువత విలవిల!

నెల్లూరులో యువతీ యువకులను జ్వరాలు కుంగదీస్తున్నాయి. వర్షాలు కురవక ముందే జ్వరాలు విజృంభించాయి. 104 డిగ్రీలతో విజృంభిస్తున్న జ్వరాలతో హాస్పిటళ్లలో చేరుతున్న యువతీ యువకుల సంఖ్య నగరంలో ఎక్కువగా వుంది. ఈ మహోధృత జ్వరాలేమిటో వైద్య ఆరోగ్య శాఖాధికారులు పరిశీలించాల్సిన అవసరం లేదంటారా?

రౌడీయిజం చేయలేదు!

రాపూరులో సమైక్య ఉద్యమకారు

కొరవ 14వ పేజీలో

వజ్రం - బంగారం - వెండి
ఫ్యాక్టరీ అవుట్‌లెట్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై*
తరుగు 6% నుండి - కూలి లేదు.
వెండి వస్తువులపై*
తరుగులేదు - కూలిలేదు.
డైమండ్స్‌పై 10% తగ్గింపు*
*T&C Apply
గోల్డ్ ప్యాలెస్
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

సిల్వర్ ఫ్యాక్టరీ అవుట్‌లెట్
925 STERLING SILVER*
EXPORT QUALITY
వెండి వస్తువులపై*
తరుగు లేదు, కూలి లేదు.
*T&C Apply
సిల్వర్ ప్లాజా
EXCLUSIVE SILVER SHOW ROOM
(A Unit of Gold Palace)
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331132, 2331121

ఆధునాతన
గృహోపకరణాలకు
చిరునామా...
AMMA FURNITURE MALL
అమ్మ ఫర్నిచర్ మాల్
సువిశాలమైన భవంతిలో
కనులను మైమరపించే
వందలాది డిజైన్లతో విభిన్న
మాడల్స్ మీ కోసం... విచ్చేయండి.
AMMA FURNITURE MALL
మినీబైపాస్‌రోడ్డు, నెల్లూరు.
ఫోన్: 0861-2302234

ఓం శ్రీ
నాగలక్ష్మి గ్రీన్ సిటీ
నెల్లూరు.
Kancharla Developers
Office : Near Children's Park
Beside Saibaba Temple Street
Chinthareddypalem Road, Nellore
9963 479 199, 9963 479 299, 9963 479 899
Site: Rangacharya Kandriga,
Kakupalli Bit-II Village, Madaraju Gudur(G.P.)
Nellore Mandal, Nellore District.

అద్దెకు భవనములు
నెల్లూరు పాగతోట నందు
విశాలమైన గదులతో భవనములు
అద్దెకు లభించును.
సూపర్ స్పెషాలిటీ క్లినిక్‌లకు,
ఆసుపత్రులకు, విద్యాసంస్థలకు,
బ్యాంకులకు అనుకూలము.
ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించగలరు.
0861-2333767
సెల్ : 98495 37495

విజయదశమి, దీపావళి శుభాకాంక్షలు
ఓం శ్రీ
నాగలక్ష్మి గ్రీన్ సిటీ, నెల్లూరు
APPROVED DTCP APPROVED


లే అవుట్ ప్రత్యేకతలు :
కస్టమర్లే మా దేవుళ్లు
• 33 అడుగుల రోడ్లు • రోడ్లకు ఇరువైపులా చెట్లు • ఎలక్ట్రికల్ లైన్స్ • తారు రోడ్లు
• ప్రతి 5 నిమిషాలకు బస్సు మరియు ఆటో సౌకర్యం • శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కృష్ణపట్నం పోర్టుకు దగ్గర్లో • లే అవుట్ చుట్టూ ఫెన్సింగ్ సౌకర్యం
• లే అవుట్‌లోనే మంచినీటి సౌకర్యం • రోడ్డుకి ఇరువైపులా సైడు కాలువల నిర్మాణం
• డిటిసిపి అప్రూవ్డ్ లే అవుట్ • ల్యాండ్ క్లియర్ టైటిల్ • 100% వాస్తు.

Kancharla Developers
Office : Near Children's Park
Beside Saibaba Temple Street
Chinthareddypalem Road, Nellore
Site: Rangacharya Kandriga,
Kakupalli Bit-II Village, Madaraju Gudur(G.P.)
Nellore Mandal, Nellore District.
Contact : 9963 479 199, 9963 479 299, 9963 479 899
త్వరపడండి! మీ అభివృద్ధి కొరకు, మీ కుటుంబం సౌభాగ్యం కొరకు

● నెల్లూరు బార్ అసోసియేషన్‌లో

భగ్గుమన్న విబేధాలు!

రామిరెడ్డి × చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు బార్ అసోసియేషన్‌లో వర్గ విబేధాలు చోటుచేసుకొంటున్నాయి. ప్రస్తుత బార్ కార్యదర్శికి, ఇతర న్యాయవాదులకు మధ్య విబేధాలు తలెత్తడంతో బార్ అసోసియేషన్ రాజకీయాలకు వేదికగా మారింది. గత ఎన్నికలలో ఇ.వి. రామిరెడ్డి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మొదట్లో మిగతా న్యాయవాదులతో సఖ్యతగా వుంటున్నా ఆతర్వాత రామిరెడ్డి వ్యవహారశైలిపై విమర్శలు తలెత్తాయి. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని పలువురు న్యాయవాదులు పలు సందర్భాలలో విమర్శలు చేశారు. పదవీ కాలం ముగిసినా వదలకుండా పదవి పట్టుకుని వేలాడుతున్నాడని దుయ్యబట్టారు. ఇటీవల ఎన్నికలకు రంగం సిద్ధం చేసినా రకరకాల కారణాలతో, ఫిర్యాదులతో న్యాయస్థానాన్ని ఆశ్రయించడం లాంటి వాటి కారణంగా ఎన్నికలు జరగలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కార్యదర్శిగా వ్యవహరిస్తున్న రామిరెడ్డిపై తిరిగి దుర్గాప్రసాద్ అనే న్యాయవాది నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపణలు చేయడంతో బార్‌లోని విబేధాలు మరోసారి బట్టబయలయ్యాయి. ఈ పరిస్థితుల్లో బార్ సెక్రటరీ రామిరెడ్డి తాను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటనలు చేయడంతో ఈ వివాదం రాజకీయ రంగు పులుముకుంది. తనపై వచ్చిన ఆరోపణలకు ఆయన స్పందిస్తూ ఎలాంటి నిధుల దుర్వినియోగం జరగలేదని ప్రకటించినా కార్యదర్శి ఏకాకిగా మారడం, అధికసంఖ్యలో న్యాయవాదులు ఆయన్ను విమర్శిస్తుండడంతో బార్ వ్యవహారం రంజుగా మారింది. సెక్రటరీ వ్యవహారశైలిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ న్యాయవాది వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి మొదటి నుంచి గుర్రుగా వున్నారు. మొత్తంమీద బార్ అసోసియేషన్‌లో రాజకీయాలు చోటుచేసుకోవడంతో విమర్శల పాలవుతుంది.

● సోదరులను దుయ్యబడుతున్న

ఆనం జయకుమార్‌రెడ్డి!

ఊపిరాడని వివేకా, రామనారాయణ



రామనారాయణరెడ్డి, సోనియా గాంధీ, వివేకా ఫ్లెక్సీలను దహనానికి సిద్ధం చేస్తున్న దృశ్యం.

నిన్నమొన్నటి వరకు కలసికట్టుగా వున్న ఆనం సోదరుల్లో చిచ్చురేగింది. సోదరుడు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డితో పొసగక బయటకు వచ్చిన ఆనం జయకుమార్‌రెడ్డి వేరు కుంపటి పెట్టుకొన్నాడు. తనతో కలిసి వచ్చే మాజీ కార్పొరేటర్లు, వివిధ ప్రాంతాల ద్వితీయ శ్రేణి నాయకులతో కలసి సమైక్యాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతోపాటు ఆనం వివేకానందరెడ్డి, ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డిల వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు చేస్తున్నాడు. పదవులు పట్టుకుని వేలాడుతున్నారని దుయ్యబట్టడంతోపాటు నెత్తుటి కూటికి దేబిరిస్తున్నారంటూ పరుష పదజాలం వాడుతుండడం చర్చనీయాంశమైంది. వివేకాతో విబేధించి వచ్చిన నాటి నుంచి కొంతకాలం మౌనంగా వున్న జయకుమార్‌రెడ్డి రాష్ట్ర విభజనకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో దాన్ని అవకాశంగా చేసుకొని తన అనుచరులతో కలసి సమైక్యాంధ్రకు మద్దతుగా పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాడు. బైక్ ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించడంతోపాటు ఎన్జీఓలు చేస్తున్న ఉద్యమానికి మద్దతు తెలిపారు. అంతే కాకుండా తన సోదరుడు ఆనం వివేకానందరెడ్డి గుడ్డల అంగళ్ల ప్రారంభోత్సవాల సందర్భంగా చీర కట్టుకుని ఫోజులిచ్చిన ఫోటోలను నిరసన కార్యక్రమాల్లో ప్రదర్శిస్తూ వివేకానందరెడ్డి వ్యవహారశైలిని విమర్శిస్తున్నాడు. తన తండ్రి వెంకటరెడ్డి ఆశయాలకు సోదరులైన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, వివేకానందరెడ్డి తూట్లు పొడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. అంతే కాకుండా తన ఇంటి వద్ద ప్రతి రోజూ పలు డివిజన్ల కార్యకర్తలు, అనుచరులతో సమావేశాలు నిర్వహిస్తూ భవిష్యత్తు కార్యాచరణకు రూపకల్పన చేస్తున్నాడు. ఇతర పార్టీల నేతలు ఆనం సోదరులపై చేస్తున్న విమర్శలకంటే సొంత తమ్ముడైన ఆనం జయకుమార్‌రెడ్డి చేస్తున్న విమర్శలు, ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి.

● గాంధీనగర్

సాయిబాబా మందిరంలో దసరా!

నెల్లూరు గాంధీనగర్‌లోని షిర్డి సాయిబాబా మందిరంలో ఈ నెల 14వ తేది నుంచి 16వ తేది విజయదశమిని పురస్కరించుకొని మహాసమాధి మహోత్సవాలు ఘనంగా జరుగుతాయని మందిరం ఛైర్మన్ మన్నెం అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఈ ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజూ ఉదయం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగుతాయి. ప్రతిరోజూ సాయంత్రం ఏడు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



గాంధీనగర్‌లో కొలువుదీరిన షిర్డిసాయి.

బాబా భక్తులు ఈ ఉత్సవాలకు విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించమంటున్నారు.

ఇక్కట్ల పాలుచేస్తున్న బంద్‌లు!

● విద్యుత్ ఆపేయడంతో ఇబ్బందిపడ్డ జనం



ట్రైర్లు దగ్ధం చేయడంతో రోడ్లపై విస్తరించిన కాలుష్యం.

రాష్ట్ర విభజన నిర్ణయం ఉపసంహరించుకోవాలని సీమాంధ్రలో గత 60 రోజులకు పైగా పెద్ద ఎత్తున ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు ఉద్యమిస్తున్న సంగతి తెలిసిందే. జై సమైక్యాంధ్ర నినాదాలతో సీమాంధ్ర దద్దరిల్లుతుంటే మరోవైపు కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర విభజనకు సంబంధించి క్యాబినెట్ నోట్ తయారు చేయడం సంచలనం రేపింది. ప్రజా జీవనం స్తంభించిపోయి, రవాణా సౌకర్యం నిలిచిపోయి, జీతాలు రాకపోయినా ఉద్యోగులు ఉద్యమంలో పాల్గొంటుంటే ఆ ఉద్యమాన్ని ఏమాత్రం లెక్కచేయకుండా, పరిగణనలోనికి తీసుకోకుండా కేంద్రంలోని పెద్దలు, కాంగ్రెస్ అగ్రనాయకత్వం రాష్ట్ర విభజనకు సంబంధించి మరో అడుగు ముందుకు వేయడం పట్ల సీమాంధ్ర ప్రజలు, ఉద్యమకారులు భగ్గుమన్నారు. కేంద్ర నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ 48 గంటల బంద్‌ను ఎన్జీఓలు నిర్వహించడంతోపాటు జాతీయ రహదారిని దిగ్బంధనం చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరోవైపు విద్యార్థి జెఏసి 72 గంటల బంద్‌కు పిలుపునిచ్చింది. విద్యాసంస్థలు మూతపడడంతోపాటు నగరంలో వాహనాలు తిరగకుండా బంద్ పూర్తిస్థాయిలో నిర్వహించడంతో జనజీవనం పూర్తిగా స్తంభించి పోయింది. ట్రైర్లు, పెద్ద మానులు రోడ్డుపై వేసి తగుల బెట్టడంతో నగరంలో పలు కూడళ్లలో పెద్దఎత్తున మంటలు, దట్టమైన పొగ అలుముకొంది. పోలీసులు అక్కడకు చేరుకుని ఉద్యమకారులకు నచ్చజెప్పారు. విద్యుత్ ఉద్యోగులు రాస్తారోకో చేస్తుండగా పోలీసులు రావడం కొందరు ఉద్యమకారులు సిఐ రాజశేఖర్‌రెడ్డి కాళ్లు పట్టుకొనే ప్రయత్నంలో ఆయన అదుపు తప్పి పడిపోవడంతో స్పెషల్ పార్టీ పోలీసులు లాఠీఛార్జీ చేయడంతో కొంత గందరగోళానికి దారి తీసింది. దీనికి నిరసనగా విద్యుత్ ఉద్యోగులు దాదాపు నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. చివరకు ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఈ వ్యవహారం చిలికి చిలికి గాలివానలా మారి సీమాంధ్ర జిల్లాలలో విద్యుత్ సరఫరా బంద్‌కు దారి తీసింది.

నెల్లూరులో జాతిపిత జయంతి!

ఘనంగా జరిగింది.

జాతిపిత మహాత్మాగాంధీ 145వ జయంతిని పురస్కరించుకొని ట్రంకురోడ్డులోని గాంధీజీ విగ్రహానికి అంతర్జాతీయ వైశ్య సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవిచలమయ్య పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ శాంతి, అహింసా పద్ధతులలో ప్రపంచంలో ఒకదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన వ్యక్తి చరిత్రలో మహాత్మాగాంధీ తప్ప మరొకరు కనిపించరన్నారు. ఈ కార్యక్రమంలో తిరువీధి ప్రకాశరావు, ముక్కాల ద్వారకానాథ్, నూకల శేషయ్యగుప్తా, నెల్లూరు రైల్వే వినియోగదారుల సంఘం అధ్యక్షులు ఏ.వి.సుబ్బారావు, కార్యదర్శి ఎం.సి.కళాధర్, మాజీ అధ్యక్షుడు జెవికే బాబు, నీలిశెట్టి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మురికివాడల అభివృద్ధికి నిధులు

కేంద్ర ప్రభుత్వం సాయం

జిల్లాలోని మునిసిపాల్టీ, కార్పొరేషన్ పరిధిలోని మురికివాడలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజి అమలు చేయనుంది. మురికివాడల్లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్న సంకల్పంతో వివిధ శాఖల సమన్వయంతో ప్రణాళిక రూపొందించనున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్, మునిసిపాల్టీలు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలు, ఇందులో భాగస్వాములు కానున్నాయి. మురికివాడల అభివృద్ధి గతంలో కేవలం మునిసిపాల్టీలు, కార్పొరేషన్ల ఆధ్వర్యంలో జరిగేది. ఈ దఫా వివిధ శాఖలకు కూడా భాగస్వామ్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుంది. మురికి వాడలను గుర్తించి ప్రజల అవసరాలకు ఏవిధంగా పనులు, కార్యక్రమాలు చేపట్టాలన్న దానిపై ముందుగా ప్రణాళిక తయారు చేయాల్సి వుంది. ప్రస్తుతం రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా జిల్లాలో ఆందోళనలు, ప్రభుత్వ ఉద్యోగులు సమ్మె చేస్తున్నారు. సమ్మె ముగిసిన తర్వాత పై శాఖల సమన్వయంతో ఒక సమావేశం ఏర్పాటు చేసి మురికివాడల అభివృద్ధికి తయారు చేయాల్సిన ప్రతిపాదనలపై చర్చించే అవకాశం వుంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మురికివాడల అభివృద్ధికి శ్రీకారం చుట్టినా ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయారు. మునిసిపాల్టీకి విడుదలైన కోట్ల రూపాయల నిధులు ప్రక్కదారి మళ్లాయన్న ఆరోపణలు వచ్చాయి. ఈ దఫా అయినా కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుని ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తే మురికివాడలు అభివృద్ధి చెందే అవకాశం వుంది.

విభేదాలను రాజేసిన ప్రసన్న!

గూడూరు వైకాపా సభలో గందరగోళం

ఇప్పటికే మూడు గ్రూపులుగా విడిపోయి నేతల మధ్య విభేదాలు నెలకొని వున్న గూడూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు మరింత చిచ్చురేపాయి. తన అనుచరుడైన పాశం సునీల్‌కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలతో దుమారం రేగింది. వైకాపా ఆధ్వర్యంలో ఇటీవల గూడూరులో సమైక్యాంధ్రకు మద్దతుగా దీక్షలు చేపట్టారు. ఎవరికివారుగా వ్యవహరిస్తున్న ఇరువురు సమన్వయకర్తలు బాలచెన్నయ్య, పాశం సునీల్‌కుమార్‌లు ఒక్కటిగా ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యకర్తలు సైతం నాయకులు ఐక్యంగా వుండడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆ దీక్ష శిబిరానికి మద్దతు తెలిపేందుకు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రావడంతో పరిస్థితి మారింది. ప్రసన్న మాట్లాడుతూ వైఎస్ జగన్ 16 నెలల తర్వాత కడిగిన ముత్యంలా బయటకు వచ్చారన్నారు. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా ఆయన నాయకత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర విభజనపై తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని, ఆయన చేసే కుట్రలు, కుతంత్రాలు త్వరలోనే బట్టబయలౌతాయని వ్యాఖ్యానించారు. అంతవరకు బాగానే వున్నా ఆ తర్వాత ప్రసన్న చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. తాను ఈ శిబిరానికి కేవలం పాశం సునీల్‌కుమార్ కోసమే వచ్చానన్నారు. మంచివాడు, యువకుడు, ఉత్సాహవంతుడైన సునీల్‌ను గూడూరు నియోజకవర్గ ప్రజలు ఆదరించాలంటూ ఎన్నికల తరహా ప్రసంగం చేయడంతో అక్కడ వున్న మరొక సమన్వయకర్త బాలచెన్నయ్య, బత్తిన విజయకుమార్‌లు దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయగా, సునీల్ వర్గీయులు ఆనందపడ్డారు.

కావలి సంఘ సేవకునికి సన్మానం!

మాలకొండారెడ్డిని ప్రశంసించిన న్యాయమూర్తులు



మాలకొండారెడ్డిని సన్మానిస్తున్న న్యాయమూర్తులు.

సేవాతత్పరుడిగా పేరుగాంచిన కావలికి చెందిన మాలకొండారెడ్డి అభినందన సభ స్థానిక ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో జరిగింది. మూడున్నర దశాబ్దాలుగా ఆయన చేస్తున్న కృషిని అభినందిస్తూ అమ్మ ఆదరణ సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ ఛైర్మన్ సి.గురప్ప, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి టి.రాజా వెంకటాద్రి, ప్రముఖ విద్యావేత్త దీపాల రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొని మాలకొండారెడ్డి చేసిన సేవలను ప్రస్తుతించారు. లోక్ అదాలత్ సభ్యునిగా వుంటూ న్యాయసలహాలు అందివ్వడంతోపాటు పేదలను చైతన్యపరచడం చేస్తున్నారన్నారు. దివిసీమ ఉప్పెనలో బాధితులకు చేసిన సేవలు, అందించిన సహాయం ప్రజల మన్ననలు అందుకొన్నాయన్నారు. అలాగే లాతూర్ భూకంపం, సారావ్యతిరేక ఉద్యమాల్లోనూ చురుకైన పాత్ర పోషించారని ప్రశంసించారు. అమ్మ ఆదరణ సంస్థ అధ్యక్షుడు నున్నా మురళీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాలకొండారెడ్డిని ఘనంగా సన్మానించారు. సన్మానగ్రహీత మాలకొండారెడ్డి తనకు జరిగిన సన్మానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌ఛార్జి విజయశంకర్, ఉపాధ్యాయులు మాలకొండయ్య, చిరంజీవి, కొండపనాయుడు, సాయిరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాలు!

గూడూరు సొసైటీ ఆదర్శం

సమైక్యాంధ్ర ఉద్యమం జిల్లాలో ఉవ్వెత్తున ఎగసిపడుతుండడం, వివిధ శాఖల ఉద్యోగులతోపాటు వ్యవసాయ శాఖ ఉద్యోగులు ఇందులో పాల్గొంటుండడంతో రైతులకు ఇబ్బందులు ఎదురౌతున్నాయి. సూచనలు, సలహాలు ఇచ్చేందుకు, విత్తనాలు, ఎరువుల రాయితీలపై ఎవరూ పట్టించుకోకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. దీనిని దృష్టిలో వుంచుకొని గూడూరు ప్రాథమిక వ్యవసాయ కో-ఆపరేటివ్ సొసైటీ రైతులకు అండదండలు అందించేందుకు ముందుకు వచ్చింది. మండల పరిధిలోని రైతాంగానికి ఈ సీజన్‌లో మినుము, వరి సాగుకు కావలసిన విత్తనాలు రాయితీపై ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. సొసైటీ ఛైర్మన్ మల్లా శ్రీనివాసులురెడ్డి, వైస్ ఛైర్మన్ గ్రిద్దలూరు ముత్యాలయ్య, సిఇఓ నారాయణలు ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. కేజి విత్తనాలకు ఐదు రూపాయల వంతున రాయితీ ఇస్తారని, ఈ మొత్తాన్ని రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రైతుకు హెక్టారుకు 2 బస్తాల చొప్పున పంపిణీ చేస్తామన్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు, బ్యాంక్ ఖాతా జెరాక్స్ కాపీలను గూడూరులోగల నెం.24 పిఏసిఎస్‌లో ఇచ్చి విత్తనాలపై రాయితీ పొందాలని కోరారు.

✦ గూడూరులో

ఘనంగా జెండా ఉత్సవం!

పోటాపోటీగా నిర్వహించారు



గూడూరులో జెండా ఉత్సవ సందడి.

దసరా నవరాత్రులను పురస్కరించుకొని గూడూరులో సాంప్రదాయబద్ధంగా నిర్వహించే జెండా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రతి ఏడాది మహాలయ అమావాస్యనాడు ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలను పట్టణంలో నిర్వహిస్తారు. కర్ణాలవీధి, తూర్పు వీధి, కోనేటిమిట్ట, గమళ్లపాళెం, కుమ్మరవీధితోపాటు వివిధ ప్రాంతాలలో 40కుపైగా జెండాలు ఊరేగించారు. వీధి దీపాల అలంకరణలు, కళ్లుమిరుమిట్లు గొలిపే భారీ సెట్టింగులు, చిత్రవిచిత్ర వేషధారణలకు తెనాలి బ్యాండ్ మేళం తోడవడంతో పట్టణ యువకుల కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ జెండా పండుగ వేడుకగా జరిగింది. పోలీసులు ఎలాంటి గొడవలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. డిఎస్పీ చౌడేశ్వరి నేతృత్వంలో పోలీసులు మద్యం షాపులను రాత్రి 10.30 గంటలకల్లా మూయించడంతో పట్టణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఈ జెండా ఉత్సవాలను వీక్షించగలిగారు. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలోగల బార్ మాత్రం తెల్లవార్లు మద్యం అమ్మకాలు జరుపుతున్నా ఎందువల్లో పోలీసులు ఆ వైపు చూడకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమయ్యాయి.

జలదంకిలో జన గర్జన

జలదంకి మండల కేంద్రంలో ఉద్యోగ జెఏసి ఆధ్వర్యంలో జరిగిన జన గర్జనలో సమైక్యవాదం హోరెత్తింది. మండల కేంద్రంతోపాటు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఉద్యమకారులు తరలి రావడంతో జలదంకి జనసంద్రంగా మారింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కావలి ఆర్డీఓ సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగితే సీమాంధ్రలో విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి సీమాంధ్రుల కృషి ఎంతో వుందన్నారు. దీనినంతటిని విస్మరించి స్వార్థ రాజకీయాల కోసం తెలుగు ప్రజలను రాష్ట్ర విభజన పేరుతో రెండుగా చీల్చడం అన్యాయమన్నారు. నీరు, నిధులు, ఉద్యోగ సమస్యలు, తలెత్తే ప్రమాదం వున్నందున రాష్ట్రాన్ని విభజించకుండా సమైక్యంగా వుంచాలని డిమాండ్ చేశారు. ఈ జన గర్జనలో తహశీల్దార్ మాల్యాద్రి, ప్రాసప్రవీణ అన్నదాత మణి, ఎమ్పీడిఓ నారాయణ తదితరులు పాల్గొని సమైక్యవాదాన్ని విన్పించారు.

● అప్నా ఇంజనీర్స్

ఉచిత వైద్య శిబిరం!

గాంధీ జయంతిని పురస్కరించుకొని నెల్లూరులోని అప్నా ఇంజనీర్స్ సంస్థ అధినేత సివిల్ ఇంజనీర్ బిఎన్.రాజు సూళ్లూరుపేటలోని జడ్పీ బాలికల హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని చెంగాళమ్మ దేవస్థానం పాలక వర్గ ఛైర్మన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. డాక్టర్ డి.మదుసూధన్‌రావు, డాక్టర్ మస్తాన్ బాష, డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎస్.రవిబాబు, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ బి.మాలకొండయ్య, డాక్టర్ పరసూరి సుబ్రహ్మణ్యం 360 మంది రోగులను పరీక్షించి మందులు ఉచితంగా పంచిపెట్టారు. కంటి అద్దాలు సైతం ఉచితంగా పంచిపెట్టారు. కంటి అద్దాలు సైతం ఉచితంగా ఇవ్వడంతో రోగుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. భవిష్యత్తులోనూ ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తానని ఈ సందర్భంగా బిఎన్.రాజు హామీ ఇచ్చారు.

బామా దశమ వార్షికోత్సవం!

కావలికి విచ్చేసిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

తన పేరున సాంస్కృతిక సంస్థ స్థాపించడంతోపాటు నిర్విఘ్నంగా కార్యక్రమాలను నిర్వహిస్తూ కళాభిమానుల ఆదరణ కలిగి వుండడం నిర్వాహకుల కార్యదక్షతకు నిదర్శనం అని ప్రఖ్యాత సినీ నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. బాలసుబ్రహ్మణ్యం ఆర్ట్స్ అండ్ మ్యూజిక్ అకాడమి (బామా) దశమ వార్షికోత్సవం పట్టణంలోని ఎబిఎం ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. బామా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థగా దీనిని తీర్చిదిద్దేందుకు నిబద్ధతతో పని చేశామన్నారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యాన్ని, వర్ధమాన నటుడు కౌషిక్‌బాబును బామా నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి, నృత్య కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సన్మాన దృశ్యం.

● రాష్ట్ర విభజన ప్రకటన చేసి

కాంగ్రెస్ పార్టీ తప్పు చేసింది!

రాష్ట్ర విభజన ప్రకటన చేసి కాంగ్రెస్ పార్టీ చాలా పొరపాటు చేసిందని, తమ నేతలు తప్పు చేశారని కావలి మాజీ మున్సిపల్ ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గ్రంధి యానాదిశెట్టి వ్యాఖ్యానించారు. సమైక్యాంధ్రకు మద్దతుగా జెఏసి ఆధ్వర్యంలో కావలి పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రాన్ని విభజించాలనుకోవడం సరైన నిర్ణయం కాదన్నారు. దీనికి కాంగ్రెస్ పార్టీతోపాటు అన్ని పార్టీలు బాధ్యులే నన్నారు. లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఉద్యమంలో పాల్గొంటున్నారని, ప్రజల డిమాండ్‌కు తలొగ్గక తప్పదన్నారు. రాజకీయ పార్టీలు ఏ కార్యక్రమం తలపెట్టినా జనాన్ని పోగు చేయాలంటే మద్యం పంపిణీ చేయడంతోపాటు 500 రూపాయలకు తక్కువ కాకుండా ఇవ్వాల్సి వస్తుందని అలాంటిది ఇంతమంది స్వచ్ఛందంగా రెండు నెలలుగా ఉద్యమంలో పాల్గొనడం చారిత్రాత్మకమన్నారు. ఎన్జీఓ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దిగ్విజయ్ సింగ్ సీమాంధ్ర పట్ల బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కొందరు రాజకీయ నాయకులు ప్రజా ఉద్యమాన్ని వారికి అనుకూలంగా మార్చుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని అలాంటివారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సమైక్యాంధ్ర సాధించేవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జెఏసి నేత తిరివీధి ప్రసాద్ స్పష్టం చేశారు.

కావలి మునిసిపల్ ఛైర్మన్ యానాదిశెట్టి విమర్శ



దళిత హక్కుల పరిరక్షణ సమాఖ్య జాతీయ కమిటీ సభ్యుడిగా ఎంపికైన మాజీ కౌన్సిలర్ ఆత్మకూరి బ్రహ్మయ్యకు కావలిలో స్వాగతం పలుకుతున్న తెలుగుదేశం పార్టీ నేతలు, వ్యాపారులు, దళిత నేతలు.

అదరగొడ్తున్న నిరసనలు!

విభిన్నతకు పెద్ద పీట

జిల్లాలో సమైక్యాంధ్ర ఉద్యమం రూపురేఖలు మారుతోంది. ఎన్జీఓల ఆధ్వర్యంలో జరుగుతున్న సమైక్యాంధ్ర కార్యక్రమాలు ఇప్పుడు కొత్త రూపును సంతరించుకొంటున్నాయి. వివిధ కుల సంఘాలు సమైక్యాంధ్ర కోరుకొంటూ కార్యక్రమాలు చేపట్టడంతోపాటు తమ బలాన్ని చాటుకొనేందుకు దీనిని అవకాశంగా తీసుకోవడంతో పోటాపోటీ నెలకొనింది. యాదవులు యాదవ గర్జన పేరుతో భారీగా నగరంలో ర్యాలీ నిర్వహించగా, బలిజ కులస్తులు బలిజ సింహగర్జనను జరిపారు. ఇక అధికారులు, ఉద్యోగ సంఘాలు వివిధ ప్రాంతాలలో వినూత్నంగా కార్యక్రమాలు చేపడుతూ వాటికి వివిధ పేర్లను పెడుతున్నారు. వెంకటగిరి గర్జనంటూ ఆ ప్రాంతంలో సమైక్యవాదులు, కావలి కేక పేరుతో కావలిలో, ఆత్మకూరులో ఆత్మకూరు అరుపు పేరుతో, ఉదయగిరిలో గిరి గర్జనంటూ పలు కార్యక్రమాలను చేపట్టారు. తతిమా ప్రాంతాల్లోని ప్రజలు సమైక్యాంధ్ర కావాలని, రాష్ట్ర విభజన జరిగితే సహించేది లేదంటూ నినదిస్తుండడంతో జిల్లా మారుమ్రోగిపోతోంది. ఎక్కడికక్కడ బైక్ ర్యాలీలు, రాస్తారోకోలు, కాగడాల ప్రదర్శనలు, బండ్‌లు చేస్తుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. జాతీయ రహదారిపైనా నిరసనకారులు బైఠాయిస్తుండడంతో అక్కడా వాహనాలు నిలచిపోతున్నాయి. ఎన్జీఓలతోపాటు వివిధ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు, ప్రైవేటు విద్యాసంస్థలు ఉద్యమంలో పాలుపంచుకోవడంతో రోజురోజుకూ ఉద్యమ ఉధృతి పెరిగిపోతోంది.

ఎఎస్‌పేట పంచాయతీల్లో పడకేసిన పాలన!

● సర్పంచ్‌లు ఏ పని చేయలేకపోతున్నారు.

సర్పంచ్‌లు లేక సమస్యలతో సతమతమైన ప్రజలు సర్పంచ్ ఎన్నికల తర్వాత కొత్తవారు వచ్చినా గ్రామ పంచాయతీల్లో మార్పు రాకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎఎస్‌పేట మండలాన్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. సర్పంచ్‌లుగా కొత్తవారు బాధ్యతలు చేపట్టినా రికార్డులు అందజేయకపోవడంతో పాలన పడకేసింది. మండలంలోని 18 పంచాయతీల్లో పరిస్థితి అంతమాత్రంగానే వుంది. గతంలో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో గ్రామల్లో పారిశుధ్యం, మౌలిక వసతులు లేక ఎవరూ పట్టించుకోక పూర్తిగా పాలన గాడి తప్పిపోయింది. పంచాయతీకి రావాల్సిన బకాయిలు రాక, వసూలు చేసే వారు లేక ఆర్థికంగానూ క్లిష్టతరంగా వుండింది. మూడు నెలల క్రిందట పంచాయతీ ఎన్నికలు జరిగి అన్నీ పంచాయతీలకు సర్పంచ్‌లు వచ్చినా పంచాయతీల్లో మార్పు రాలేదు. అధికారులు రికార్డులు అందజేయకపోవడంతో ఏ పని చేయలేక, ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, సమస్యలు పరిష్కరించలేక సతమతం అవుతున్నారు. సర్పంచ్‌లు, సమైక్యాంధ్ర ఉద్యమంలో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొంటుండడంతో రికార్డులు అందక శిలావిగ్రహాల్లా నామమాత్రంగా మారుతున్నామని వాపోతున్నారు పలువురు సర్పంచ్‌లు.

ఓజిలిలో విషజ్వరాలు!

కిటకిటలాడుతున్న పిహెచ్‌సిలు

ఓజిలి మండలంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. పారిశుధ్యం క్షీణించడం, దోమలు అధికం కావడంతో పలు ప్రాంతాల ప్రజలు అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. దీనికి ప్రధాన కారణం పారిశుధ్య పరిస్థితులే. ఓజిలి, వజ్జవారిపాళెం, అత్తివరం, కురగొండ, పెదపరియ తదితర ప్రాంతాల్లో విషజ్వరాల బారినపడిన వారు అధికంగా వున్నారు. డెంగ్యూ లాంటి జ్వరాలు బయటపడుతుండడంతో స్థానికులు వణికిపోతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు ప్రైవేటు ఆస్పత్రులు జ్వరాలతో వచ్చేవారితో కిటకిటలాడుతున్నాయి. సరైన వ్యాధి నిర్ధారణ చేసే సౌకర్యం స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో పలు కేసులను మద్రాసుకు పంపుతున్నారు. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ లాంటివి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసి మంచాన పడేస్తున్నా అధికారులు తగిన నివారణ చర్యలు చేపట్టక పోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కాలువలు పూడిపోయి, సక్రమంగా చెత్త తొలగించకపోవడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయకపోవడంతో అస్థవ్యస్థ పరిస్థితులు ఏర్పడుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరవ కాల్వలు పూడిపోతున్నాయి!

వెంకటగిరిలో ఇదీ పరిస్థితి

వెంకటగిరి నియోజకవర్గంలోని వరవ కాలువల బాగోగులు పట్టించుకోకపోవడంతో అవి పూడిపోయి, పిచ్చి మొక్కలతో రూపురేఖలు కోల్పోతున్నాయి. ఫలితంగా చెరువుల్లోకి నీరు చేరక రైతులు పంటల సాగుకు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 319 చెరువులు వున్నాయి. ఈ చెరువులకు నీరు చేరాలంటే కొండ వాగులకు అనుసంధానంగా వందలాది వరవ కాలువలు వున్నాయి. వీటి ద్వారా నీరొచ్చి చెరువులు నిండితేనే మాగాణి భూముల్లో పంటలు పండాల్సి వుంది. రెండుసార్లు చెరువులు నిండితే తప్ప కొండ క్రింది ప్రాంతాల్లోని భూముల్లో పంటలు పండవు. వర్షపునీటి కారణంగా పిచ్చిమొక్కలు మొలచి వరవ కాలువలు పూడిపోవడం, నీరు పారక అడ్డంకులు ఏర్పడడం జరుగుతుంటుంది. పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ ప్రతి ఏటా నిర్వహించాల్సి వున్నా నిధుల కొరతతో ఆ పనులేవీ జరగడం లేదు. దీంతో నియోజకవర్గంలోని ప్రధాన చెరువులు ఇలాంటి ఇబ్బందినే ఎదుర్కొంటున్నాయి. జిల్లాలోని పెద్ద చెరువుల్లో ఒకటైన బాలాయపల్లి మండలంలోగల కయ్యూరు చెరువుతోపాటు వెంకటగిరి మండలంలోని మరో ఏడు చెరువులకు కైవల్యానది వరద ప్రవాహాన్ని మళ్లించేందుకు నిర్మించిన వరవ కాలువలు పూడిపోయి వున్నాయి. గొడ్డేరు ఆనకట్ట నుంచి 14 చెరువులకు వర్షపు నీటిని మళ్లించే కుడి, ఎడమ కాలువలు పూడిపోతున్నాయి. కాలువల కట్టలు కరిగిపోతున్నాయి. వెంకటగిరి పల్లెల్లోని చెరువుల క్రింద పంటలకు గొడ్డేరు ఆనకట్ట నీరే ఆధారం. డక్కిలి మండలంలోని చెరువుల పరిస్థితీ ఇంతే. దీనిని దృష్టిలో వుంచుకొని వర్షపునీరు చెరువులకు చేరేలా వరవ కాలువల పూడికతీత చేపట్టాలని అధికారులను ఈ ప్రాంత ప్రజలు కోరుకొంటున్నారు.

మూగజీవాలకు సమైక్య సెగ!

రెండు నెలలుగా మూతబడ్డ పశు వైద్యశాలలు

సమైక్యాంధ్ర ఉద్యమ ప్రభావం మూగజీవాలపైనా పడింది. అనారోగ్యాన్ని ఎవరికీ చెప్పుకోలేక మౌనంగా రోదించే పశువులకు జబ్బు కనుగొని వైద్యం చేసి పశువైద్యులు సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొంటుండడంతో గ్రామాల్లో పశువైద్య కేంద్రాలు మూతపడ్డాయి. ఫలితంగా పశువుల బాగోగులు పట్టించుకోనేవారు లేక, ఏ జబ్బుతో బాధపడుతోందో, ఏ మందు వాడాలో తెలియక పశువుల యజమానులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా గ్రామాల్లో బర్రెలు, ఆవులు సీజనల్ వ్యాధుల బారిన పడుతుంటాయి. వర్షాలు కురవడంతో పచ్చిగడ్డి ఎక్కడపట్టినా దొరుకుతుండడంతో మేతకు ఇబ్బంది కలగడం లేదు పశువులకు. వర్షాకాలంలో సాధారణంగా మూగ జీవాలకు కొన్ని రకాల వ్యాధులు వస్తుంటాయి. గాలికుంటు వ్యాధి, కుంటువాపు, పొదుగువాపు, పచ్చికదొమ్మ తదితర సమస్యలు చుట్టుముడుతుంటాయి. నీళ్లలో వున్న బ్యాక్టీరియా కారణంగా పశువులు ఈ వ్యాధుల బారిన పడుతుంటాయి. కొన్ని పశువులకు కాలి గిట్టలు, నోటిలో, కడుపులో పుండ్లు ఏర్పడుతుంటాయి. వీటిని పశువైద్యుడు గుర్తించి మందులిస్తుంటారు. అయితే సమైక్యాంధ్ర సమ్మెలోకి పశువైద్యులు వెళ్లడంతో జిల్లాలోని పశువుల యజమానులు, రైతులు, పాలపై ఆధారపడి వ్యాపారం చేసేవాళ్లు ఆందోళన చెందుతున్నారు.



సమైక్యాంధ్రకు మద్దతుగా కావలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల శిబిరంలో కావలి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోసల గోపాలరెడ్డి, చేవూరి తిరుపాల్ తదితరులు.

సమైక్యాంధ్ర తెలుగువారి జన్మ హక్కు!

వెంకటాచలం వద్ద దీక్షలో కాకాణి

తెలుగు ప్రజలు, సంస్కృతి, చరిత్ర తెలియని కేంద్రంలోని కాంగ్రెస్ నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర విభజనకు పూనుకొన్నారని సర్వేపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షను గమనించకుండా, వారి అభిప్రాయాలు తెలుసుకోకుండా కేంద్రం ఏకపక్షంగా వ్యవహరించిందన్నారు. సమైక్యాంధ్ర కోసం వెంకటాచలంలో ఏర్పాటుచేసిన దీక్షా శిబిరం వద్ద కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. సమైక్యంగా వుండాలని కోరుకోవడం తెలుగు ప్రజల జన్మహక్కన్నారు. రాష్ట్ర విభజన వల్ల వచ్చే ఇబ్బందులు, తలెత్తే సమస్యలను గుర్తించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. అందుకోసమే గత రెండు మాసాలుగా రాష్ట్రంలో సమైక్యవాద ఉద్యమం పువ్వెత్తున ఎగసి పడుతున్నాదన్నారు. సీమాంధ్రులు హైదరాబాద్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేశారన్నారు. ప్రస్తుతం అప్పుల్లో వున్న ఆర్టీసికి హైదరాబాద్‌లోనే వేల కోట్ల రూపాయల ఆస్తులున్నాయన్నారు. రాష్ట్రానికి అన్ని రకాలుగా హానీ జరుగుతుంటే ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు సమైక్యాంధ్రకు కట్టుబడి వున్నామని ఒక్క ప్రకటన చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడానికి సోనియాగాంధీ తెలుగు రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేయడానికి సిద్ధపడిందని తీవ్ర విమర్శలు చేశారు.

● ఎన్టీఆర్, వైఎస్‌లు

తెలుగుతల్లికి రెండు కళ్లే వంటివారు!

నార్తురాజుపాళెం దీక్షలో నల్లపరెడ్డి ప్రసన్న

తెలుగు జాతికి ద్రోహం తలపెట్టిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును సీమాంధ్రలో బహిరంగంగా ఉరి తీయాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాన్ని రెండుగా చీల్చేందుకు జరిగిన కుట్రలో విభజనకు అనుకూలంగా లేఖ ఇచ్చి చంద్రబాబు భాగస్వామి అయ్యాడని దుయ్యబట్టారు. తెలుగు జాతిని విడదీయాలనుకోవడం దుర్మార్గ చర్య అన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా కొడవలూరు మండలం నార్తురాజుపాళెంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన దీక్షా శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో సమైక్యాంధ్ర పాలన కోసం తమ పార్టీ 175 నియోజకవర్గాలలో నిరాహార దీక్షలు చేపట్టారన్నారు. తెలుగు తల్లికి ఎన్‌టి రామారావు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రెండు కళ్లు లాంటి వారైతే జగన్ గుండె అని అభివర్ణించారు. సమైక్యాంధ్ర ఉద్యమంపై చిత్తశుద్ధి వుంటే ముఖ్యమంత్రితోపాటు మంత్రులందరూ తమ పదవులకు రాజీనామాలు చేసి ఉద్యమంలో పాల్గొనాలని డిమాండ్ చేశారు. కేంద్రం మెడలు వంచి రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని దీక్ష చేస్తామని ప్రకటించారు.

● పాలకుల స్వార్థమే

రాష్ట్ర విభజనకు మూలం!


కావలి ఆర్డీఓ స్పష్టీకరణ

ప్రపంచానికే సమైక్య స్ఫూర్తిని చాటిన మహాత్మాగాంధీ పుట్టిన దేశం నేడు గాంధీ మార్గం నుంచి దారి తప్పుతున్నాదని కావలి ఆర్డీఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పలు భాషలు, భిన్నజాతులు, చీలికలు పేలికలుగా వున్న సంస్థానాలను తన సిద్ధాంతాల ద్వారా ఏకీకృతం చేసి బ్రిటీష్ వారిని దేశం నుంచి తరిమికొట్టిన గాంధీ స్ఫూర్తి కొరవడడం వల్లనే రాష్ట్రంలో విభజన చిచ్చురేపిందన్నారు. గాంధీ చూపిన మార్గం మాదని చెప్పుకొనే పాలకులు రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచడంలో విఫలమవుతున్నారన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో గల గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం మందికి పైగా ప్రజలు సమైక్య రాష్ట్రాన్ని కోరుకొంటుంటే కొన్ని పార్టీలు, కొందరు స్వార్థపరులు మాత్రం స్వప్రయోజనాల కోసం తెలుగు ప్రజల మధ్య విభజన చిచ్చు పెడుతున్నారని, రాష్ట్ర భవిష్యత్తును పణంగా పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన వల్ల భవిష్యత్ తరాలకు తీరని నష్టం జరుగుతుందన్న ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో వుంచుకొని ప్రతి ఒక్కరు సమైక్య రాష్ట్రం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు

ఇందుకూరుపేటలో పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లు!

ఇందుకూరుపేట మండలంలో బెట్టింగులు, పేకాట జోరుగా నడుస్తోంది. స్థానికంగా వుండే కొందరు వ్యాపారం ముసుగులో వీటిని నిర్వహిస్తుండడంతో మండలంలోని పలు గ్రామాల నుంచేకాక చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి పందెం రాయుళ్లు, పేకాట ఆడేవాళ్లు వస్తున్నారు. ఇందుకూరుపేట, కొత్తూరు గ్రామాల్లో ఇవి విచ్చలవిడిగా నడుస్తున్నట్లు సమాచారం. కొత్తూరు బిసి కాలనీ, ఇందుకూరుపేట, పల్లిపాళెంలోని యువకులు జోరుగా క్రికెట్ బెట్టింగులు పెట్టి జీవితం నాశనం చేసుకొంటున్నారు. పేకాటా అదే స్థాయిలో వుంది. స్థానికంగా వుండే చిల్లర అంగళ్ల నిర్వాహకులతోపాటు, ఈ బెట్టింగుల్లో ఆరితేరిన వారు గుట్టు చప్పుడు కాకుండా వీటిని నిర్వహిస్తూ లక్షలు గడిస్తున్నారు. ఎంకెఆర్ హైస్కూల్ వద్ద పొలాల్లో, యాకటి దిబ్బ, బిసి కాలనీల్లో పేకాట కేంద్రాలు నడుస్తున్నాయి. ఇక మైపాడు సముద్రతీర ప్రాంతాల్లో అల్లరి మూకల సంచారం అధికంగా వుంది. గంజాయి అమ్మకాలు ఈ ప్రాంతంలో జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. గంజాయి అమ్మకాల్లో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారట. బీచ్‌కు వచ్చే మహిళల పట్ల అల్లరి మూకల వేధింపులు అధికం అయ్యాయి. పోలీసులు ఇందుకూరుపేట మండలంపై దృష్టి సారించి బెట్టింగ్‌లు, పేకాటను అరికట్టడంతోపాటు బీచ్‌కు వచ్చే సందర్శకులకు తగిన రక్షణ కల్పించాల్సి వుంది.



దేవేరులకు ప్రీతికర మాసం ఆశ్వీయుజం!



ప్రజలందరికీ ఆనందాల వెలుగులను ప్రసాదించే దివ్యమైన మాసం ఆశ్వీయుజ మాసం. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరుల దేవేరులైన సరస్వతి, మహాలక్ష్మి, పార్వతీదేవీలకు అత్యంత ప్రీతికరమైన మాసం ఇది. వారిని పూజించడానికి కరుణా వీక్షణాలు పొందడానికి ఉత్కృష్టమైన, అనువైన మాసం ఆశ్వీయుజం. శరధృతువు ఈ మాసంలో ఆరంభమవుతుంది. చాంద్రమానం ప్రకారం ఆశ్వీయుజం ఏడవ మాసం. ఆయా నక్షత్రాల సమీపంలో చంద్రుడు సంచరిస్తే ఆ నెలలకు ఆ పేరు వచ్చినట్లుగానే ఈ నెలలో అశ్వనీ నక్షత్రం సమీపంలో పూర్ణిమనాడు చంద్రుడు సంచరించడం వల్ల ఈ మాసానికి ఆశ్వీయుజ మాసం అని పేరొచ్చింది. మనకు గల ఇరవైఏడు నక్షత్రాలలో అశ్వనీ నక్షత్రం మొదటిది. ఆ ప్రకారం చూస్తే ఆశ్వీయుజ మాసం తొలిమాసం అవుతుంది.

ఆశ్వీయుజ మాసానికి ఎంతో విశిష్టత, ప్రాధాన్యత వున్నాయి. ఈ మాసంలో వచ్చే తొమ్మిది రోజులు అనగా శుక్ల పక్ష పాడ్యమి తిథి నుంచి నవమి వరకు శక్తి ఆరాధనకు విశిష్టమైన రోజులు. వీటిని దేవీ నవరాత్రులు అంటారు. దేవీ ఆరాధనకు ప్రధానమైన రోజులు కాబట్టి దేవీ నవరాత్రులు అని, శరత్కాలంలో వచ్చే రాత్రులు కనుక శరన్నవరాత్రులు అనే పేరొచ్చిందని చెబుతారు. జగన్మాత అయిన పార్వతి దేవి దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం తొమ్మిది అవతారాలను ధరించింది ఈ ఆశ్వీయుజ మాసంలోనే. అలాగే ఆయుర్వేద వైద్యుడైన ధన్వంతరి జన్మించింది, త్రిమతాచార్యులలో ద్వైత సిద్ధాంత ప్రవక్త అయిన మధ్వాచార్యులు జన్మించింది ఈ నెలలోనే కావడం విశేషం. దుష్ట దానవుడైన నరకాసురుడు అంతమొందింది ఆశ్వీయుజమాసంలోనే కాబట్టి ఈ మాసాన్ని ప్రజలకు ఆనందాల వెలుగులను పంచిన దివ్యమైన మాసంగా చెబుతారు. ఆనాడు నరక చతుర్దశిగా, మరునాడు దీపావళి పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు. ఇక దసరాల్లో ప్రత్యేకంగా చెప్పుకోవలసినది బొమ్మల కొలువులు. అమ్మవారిని తొమ్మిది రోజులపాటు పూజించడంతోపాటు బొమ్మలను కొలువుదీర్చడం సాంప్రదాయంగా వస్తుంది. ఈ బొమ్మల కొలువులకు ఒక విశేషముంది. సత్వ, తమో, రజో గుణాలను అధిగమించడం ద్వారా ఆ దేవి కృప పొందగలుగుతారనే సత్యాన్ని ఈ బొమ్మల కొలువు ద్వారా తెలియజెప్తారు. అమ్మవారిని తొమ్మిది రోజులపాటు ఆరాధిస్తారు. నవరాత్రులుగా జరుపుకొంటారు కాబట్టి దీనిని దృష్టిలో వుంచుకొని బొమ్మల కొలువును తొమ్మిది మెట్లతో తీర్చిదిద్దుతారు. బొమ్మల కొలువు పెట్టడం మొదలు పెట్టాక సంవత్సరానికి ఒక్కో మెట్టు చొప్పున తొమ్మిది మెట్ల వరకూ పెంచుకొంటూ పోతారు. అలాగే ప్రతి ఏడాది తప్పనిసరిగా ఒక్కటైనా కొత్త బొమ్మ కొనడం సాంప్రదాయం. పై మెట్లపై దేవుళ్లను వుంచుతారు. అమ్మవారి బొమ్మలు కూడా వుంచే ఈ చోటును సత్వ గుణానికి ప్రతీకగా నిర్వచిస్తారు. క్రిందిమెట్లపై ప్రాపంచిక జీవితానికి సంబంధించిన బొమ్మలను, మధ్యలో క్షత్రియ ధర్మాన్ని తెలిపేలా రాజు, రాణి తదితర యుద్ధ వీరుల బొమ్మలు పెడతారు. మెట్లపై తెల్లని వస్త్రాన్ని పరుస్తారు. పై మెట్ల మీద అమ్మవారి కలశాన్ని వుంచుతారు. భక్తి భావంతోపాటు కళాభిరుచి ఈ బొమ్మల కొలువుల్లో కన్పడుతుంది. గతంలో మట్టి బొమ్మలను బొమ్మల కొలువుకు అధికంగా వినియోగించేవారు. మారిన పరిస్థితుల్లో ఇప్పుడు ప్లాస్టిక్ బొమ్మలు చోటు సంపాదించాయి.

కన్వెన్షన్ సెంటర్



● నెల్లూరు సిగలో మణిమకుటం

విపిఆర్ కన్వెన్షన్ సెంటర్!

- దక్షిణ భారతదేశంలోనే అద్భుతమైన కన్వెన్షన్ సెంటర్.
- నెల్లూరు ప్రతిష్ట పెంచే నిర్మాణం.
- పెళ్లిళ్లు, సెమినార్లు, కార్పొరేట్ సమావేశాలు ఏవైనా సరే మనసు నచ్చేలా జరుపుకొనేందుకు వీలుగా 15వేల చదరపు అడుగుల సెంట్రల్ ఏసి హాల్.



నెల్లూరీయులు ఎక్కడున్నా తమలోని సృజనాత్మకత, ప్రతిభను ప్రదర్శించి ఉన్నత స్థానాలను అధిరోహిస్తారు. హోటళ్లు, భవనాలు, రోడ్లు, హాస్పిటళ్ల నిర్మాణం, నిర్వహణలో ప్రపంచవ్యాప్తంగా పేరుగడించిన నెల్లూరీయులెందరో. వీరిలో మరింత విలక్షణుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. బొగ్గు గనుల త్రవ్వకంలో దేశంలోనే పేరుగాంచిన కాంట్రాక్టర్ ఆయన. సాధారణ కుటుంబీకునిగా ప్రస్థానం మొదలుపెట్టి కష్టపడి ఎంతో ఎత్తుకు ఎదిగినా అందరికీ ఒదిగి ఉండే మనిషి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. దాతృత్వంలో ఆయన శిబి చక్రవర్తిని మరిపిస్తారు. చదువుకోవాలనుకొనే పేద పిల్లలు, ఎన్నో సంస్థలు, వ్యక్తులు, నిర్మాణాలకు లక్షలాది రూపాయలు విరాళాలను ఇచ్చిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి స్వంత ఊరు నెల్లూరులోనూ ఏదో ఒక అద్భుత నిర్మాణం చేపట్టాలన్న కోరిక మనసులో ఉండేది. ఇన్నాళ్లకు దీనికి సాకారంగా దక్షిణ భారతదేశంలోనే ఇప్పటివరకు ఎక్కడా కట్టనటువంటి మయసభను సృష్టించిన మయుడే ఔరా అని ఆశ్చర్యపోయేలా విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌ను నగరానికి కూతవేటు దూరంలోని గొలగమూడి రోడ్డులో ఎనిమిదిన్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. కనువిందు చేసే పచ్చదనం మధ్య శుభకరమైన తూర్పు ముఖంలో ఏర్పాటైన వేదికపై నిశ్చితార్థాలు, పెళ్లిళ్లు, సెమినార్లు, కార్పొరేట్ సమావేశాలు, పుస్తకాలు, సిడిల ఆవిష్కరణలు, పుట్టిన రోజు వేడుకలు, సంగీత, నృత్య కళారంగ కార్యక్రమాలు, వాణిజ్య ప్రదర్శనలు, ఉపన్యాసాలు, ప్రవచనాలు ఒకటేమిటి మనం గొప్పగా జరుపుకోవాలనుకొనే ఏ కార్యక్రమమైనా విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసుకోవచ్చు.

విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ 15వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో విలాసవంతమైన, సౌకర్యవంతమైన సీట్లతో సెంట్రల్ ఎసితో 500 మంది నుంచి రెండు వేల మందిని మించి భారీ కార్యక్రమాలు చేసుకొనేందుకు వీలుగా రూపుదిద్దారు.

ఐదు నక్షత్రాల వంటశాల!

కన్వెన్షన్ హాల్‌లో కమనీయంగా ఏడువేల చదరపు అడుగుల రిసెప్షన్ లాబీ, మరో 15వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భోజనశాల, ఐదు నక్షత్రాల స్థాయి కలిగిన విదేశాల నుండి దిగుమతి అయిన పరికరాలతో కూడిన వంటశాల, ఎకరం విస్తీర్ణంలోని లాన్‌లో బయట పార్టీలు జరుపుకోవాలనే వారికి ప్రత్యేక వసతులన్నీ ఇక్కడ కొలువు దీరాయి.

అతిథులకు ఎనిమిది వసతి గృహాలు!

ఈ హాల్‌లో పెళ్లిళ్లు చేసుకునే వారికి వధూవరులకు వస్త్రధారణ గదులు రెండు, అతిథులకు మూడు నక్షత్రాల హోదాగల ఎనిమిది వసతి గృహాలు, రెండు ప్రత్యేక సూట్‌లు, వాటిని సులువుగా చేరుకొనేందుకు లిఫ్ట్ సౌకర్యం ఈ కన్వెన్షన్ సెంటర్ ప్రత్యేకతలు.

500 కార్లకు పార్కింగ్ సౌకర్యం!

అద్భుతంగా తీర్చిదిద్దిన ఈ ప్రాంగణంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో 500 కార్లు ఇబ్బంది లేకుండా పెట్టుకొనే, తీసుకొనే పార్కింగ్, ద్విచక్ర వాహనాలకు భారీ వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు కూడా ఇక్కడ ఉంది. మహా నగరాలకు మాత్రమే పరిమితమైన కన్వెన్షన్ సెంటర్‌ను నెల్లూరులో నిర్మించి ప్రతిష్ట పెంచిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరీయులు అభినందిస్తారు.

సోమశిల నుంచి సాగునీటి విడుదల ఎప్పుడు?

సోమశిలలో 43 టిఎంసిల నీళ్లున్నాయి. కాని జిల్లాలో వరిపంట సాగు కోసం నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు నివేదికలు తయారు చేయడం, ఐఏబి సమావేశానికి తగిన చర్యలు తీసుకోలేదు.

జిల్లాలో వరిపంట సాగు చేసేందుకు అవసరమైన నీటి విడుదల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. సోమశిల జలాశయంలో వ్యవసాయానికి కావలసిన నీటి నిల్వలు చేరడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జలాశయం నుండి నీటిని విడుదల చేస్తే నారుమళ్లు పోసుకుని వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. అయితే ప్రభుత్వం నుండి గానీ, నీటి పారుదల శాఖ, వ్యవసాయ శాఖ అధికారుల వైపు నుండి గానీ సాగు నీటి విడుదలపై ప్రకటన జారీ కాకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వరి పంటను ప్రధాన పంటగా భావిస్తారు. ప్రజాప్రతినిధులు సైతం వ్యవసాయ సాగు గురించి ఉన్నతాధికారులతో చర్చించిన దాఖలాల్లేవు. ఎవరూ స్పందించక పోవడంతో రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులే ఆందోళనకు దిగేందుకు సిద్ధమవుతున్నారు.

గత సంవత్సరం అక్టోబర్ 14వ తేది తొలి సాగునీటి సలహా బోర్డు సమావేశం జరగ్గా రెండవ సమావేశం నవంబర్ 15న నిర్వహించడం జరిగింది. ఈ సంవత్సరం ఐఏబి సమావేశం జరపాలన్న ఆలోచన కూడా చేయడం లేదు. ప్రస్తుతం సోమశిల రిజర్వాయర్‌లో 43 టిఎంసిల నీటి లభ్యత ఉంది. అక్టోబర్, నవంబర్ మాసాల్లో వర్షాలు కురిస్తే నీటి నిల్వలు పెరిగే అవకాశం వుంది. లేకుంటే వున్న నీటి నిల్వలతోనే వరిపంట సాగు చేయాల్సిన పరిస్థితి. ప్రతి సంవత్సరం సోమశిల రిజర్వాయర్‌లో నీటి లభ్యత అధికంగా వుంటే రెండవ పంటకు ప్రభుత్వం అనుమతిచ్చేది. ఈ సంవత్సరం నీటి నిల్వలు లేకపోవడంతో రెండవ పంట వేయలేక పోయారు రైతులు. దీంతో సాగునీటి కాల్వల మరమ్మత్తులు, లైనింగ్ పనులు వేగవంతం చేసి నిర్ణీత సమయానికి పూర్తి చేయగలిగారు. ప్రస్తుతం అన్ని సాగునీటి కాల్వలు సిద్ధంగా వున్నాయి. నీటిని విడుదల చేస్తే చివరి ఆయకట్టు వరకు నీరు సరఫరా అవుతుంది.

అధికారికంగా గత సంవత్సరం మూడు లక్షల ఎకరాలకు నీరు విడుదల కాగా, అనధికారికంగా మరో లక్ష ఎకరాలకు పైగా వరి సాగుబడి జరిగింది. సోమశిల రిజర్వాయర్ కింద దాదాపు ఐదు లక్షల ఎకరాలు సాగు చేస్తారు. గత సంవత్సరం 24.50 టిఎంసిలతో మూడులక్షల ఎకరాలు సాగు చేయాలని ఐఏబి సమావేశంలో తీర్మానించారు. ఈ సంవత్సరం 43 టిఎంసిలకు పైగా నీరు వుండడంతో మరింత విస్తీర్ణం పెరిగే అవకాశం వుంది. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా నీటి పారుదలశాఖ, వ్యవసాయ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది సమ్మెలో కొనసాగుతున్నారు. కేవలం ఎస్ఇ స్థాయి అధికారులే కార్యాలయంలో విధులకు హాజరవుతున్నారు. జిల్లా కలెక్టర్ సాగునీటి సలహా బోర్డు సమావేశం ఏర్పాటుచేసి నీటి విడుదలపై చర్చించి ప్రభుత్వానికి తీర్మానం పంపాల్సిన బాధ్యత ఆయనపై ఉంది.

2013-14 సంవత్సరానికి సంబంధించి నీటి పారుదల శాఖ, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు నీటి విడుదల, వరి పంట సాగుచేసే విస్తీర్ణంపై ప్రతిపాదనలు తయారు చేయాల్సి వుంది. ఈ రెండు శాఖలు రూపొందించే ప్రతిపాదనలపై ఐఏబి సమావేశంలో చర్చిస్తారు. జిల్లా కలెక్టర్ నుంచి ముందస్తు ఆదేశాలు లేకపోవడం వల్ల అధికారులు సైతం మౌనంగా వుండిపోయినట్లు తెలుస్తుంది. పెన్నా డెల్టా, కనుపూరు కాలువ, కావలి కాలువ, దక్షిణపు కాలువ, ఉత్తర కాలువల కింద వున్న ఆయకట్టు రైతులు మాత్రం సోమశిల రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు. జిల్లాలోని అందరు శాసనసభ్యులు, రైతు సంఘాల ప్రతినిధులు నీటి విడుదల కోసం అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అట్రాసిటీ కేసులపై కలెక్టర్ విస్మయం!


"ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, మహిళలపై అత్యాచారాలు, నిందితులపై కేసు నమోదు, పోలీసు విచారణలపై సరైన సమాచారంతో అధికారులు రాకపోవడంతో ఇటీవల జరిగిన అట్రాసిటీ కమిటీ సమావేశంలో ప్రజాప్రతినిధులు సంధించిన ప్రశ్నలకు కలెక్టర్ శ్రీకాంత్ జవాబు చెప్పను ఇబ్బంది పడ్డారు."

జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, మహిళలపై అత్యాచారాలు, నిందితులపై కేసు నమోదు, పోలీసు విచారణలపై జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ విస్మయం చెందారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని గోల్డన్ జూబ్లీహాల్లో అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. అట్రాసిటీ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు దళితులపై జరుగుతున్న సంఘటనల విషయమై జిల్లా కలెక్టర్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు కలెక్టర్ కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది. వివిధ రకాలుగా వివక్షతకు గురికాబడిన వారు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తుంటారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సంఘటన జరిగిన గ్రామానికి వెళ్లి విచారణ జరపకుండా కాలయాపన చేయడం ఏమిటని సభ్యులు ప్రశ్నించారు.

ప్రధానంగా గూడూరు, ఆత్మకూరు ప్రాంతాల్లో అనేక కేసులు పెండింగ్‌లో వున్నాయి. అట్రాసిటీ కేసులపై విచారణ జరిపే బాధ్యత డిఎస్పీలదే. ఇక్కడ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి నిందితులపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వున్నాయి. కొన్ని సంఘటనల్లో దళితులపై కౌంటర్ కేసులు పెట్టే స్థాయికి వెళుతున్నారు. కౌంటర్ కేసుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలంటూ పోలీస్ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అధికారుల ఆదేశాలు బుట్ట దాఖలవుతున్నాయి. పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి విసుగు చెందుతున్నారు బాధితులు. కేసు నమోదు చేయడంలో జాప్యం చేస్తున్నారు. ఒకవేళ కేసు నమోదైనా నిందితులను అరెస్టు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరు కారణంగా అట్రాసిటీ కేసుల్లో ఏ మాత్రం పురోగతి కనిపించడం లేదు. బాధితులకు సత్వర న్యాయం జరగకపోవడంతో ప్రజాప్రతినిధులు సైతం జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రతి మూడు నెలల కోసారి అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహిస్తుంటారు. ఈ సమీక్షకు సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, పోలీసు శాఖ అధికారులతోపాటు సభ్యులు, హాజరవు తుంటారు. ఇటువంటి సమావేశాలకు ఎమ్మెల్యేలు హాజరుకావడం చాలా అరుదు. అట్రాసిటీ కమిటీ సభ్యుల ఎంపికలో సరైన మార్గదర్శకాలు పాటించిన దాఖలాలు కనిపించలేదు. గతంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల్లో పనిచేసిన వారికే ప్రాధాన్యత నిచ్చేవారు. ఈ దఫా ఏ కారణం చేతనో తెలియదు గానీ అట్రాసిటీ యాక్టుపై కనీస అవగాహనలేని, దళితుల సమస్యలపై సరైన విధంగా స్పందించలేని వారికి కమిటీలో స్థానం కల్పించడం జరిగింది. అధికార పార్టీకి చెందిన నేతల సిఫార్సులతో పలువురు సభ్యులుగా నియమింపబడ్డారన్న ఆరోపణలు లేకపోలేదు.

సూళ్లూరుపేట, గూడూరు ఎమ్మెల్యేలు దళిత సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో అట్రాసిటీ కేసులపై స్పందిస్తున్నారు. వీరి ఆవేదన, ఆందోళనలు అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. గూడూరు డివిజన్‌లో జరిగిన పలు సంఘటనలపై కలెక్టర్ వివరణ ఇవ్వాలని కోరినా పూర్తి సమాచారం లేకపోవడంతో మౌనంగా వుండిపోవాల్సి వచ్చింది. ఎస్సీ, ఎస్టీలకు ఆసరాగా నిలిచి సహాయ సహకారాలు అందించాల్సిన సంక్షేమ శాఖాధికారులు తమకు సంబంధం లేదన్న విధంగా వ్యవహరిస్తున్నారు. అట్రాసిటీ కమిటీ సభ్యులు సమావేశానికి హాజరైనా సమస్యలపై మాట్లాడ లేక పోతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి అట్రాసిటీ యాక్టును కఠినంగా అమలు చేయడంతోపాటు బాధితులకు అన్నివిధాల సహాయం చేయాల్సిన అవసరం వుంది.





మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

కుటుంబంలో జీవిత భాగస్వామి, సంతాన ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. తలచి కార్యాలు నిర్విఘ్నంగా నెరవేర్చగలరు. కోపతాపాలు అదుపులో వుంచుకోవాలి. వాహన మార్పులు అనుకూలించవు. వృత్తి, వ్యాపారా, ఉద్యోగాలలోని వారికి మిశ్రమ ఆదాయం. నిరుద్యోగులకు నూతనావకాశాలు ప్రోత్సాహకరంగా వుంటాయి. స్థిరాస్తి విషయాలలో సోదర వర్గంతో విభేదాలు రావచ్చు.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశర 1,2 పా

ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా పడటం లేదా నెమ్మదవడం వుంటుంది. ఆర్థిక వ్యవహారాలలో సమయానుకూల ప్రవర్తన అవసరమౌతుంది. అవసరానికి చేతికి డబ్బు అందుతుంది. మనోసంకల్ప సిద్ధి నెరవేరే సమయం ముందుంది. జాయింట్ వ్యాపారాలలో భాగస్వాములతో సమన్వయం పాటించడం మేలు. ఇంటి నిర్మాణ పనులు వాయిదా పడతాయి. దైవ చింతన పెరుగుతుంది.



మిథునం
మృగశర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

కొంత వరకు ప్రతికూలతలున్నా చేపట్టిన పనులలో ఆటంకాలు, అనుకోని సంఘటనలు లేదా కష్టాలు ఎదురౌతాయి. ముందు జాగ్రత్త లవసరం. శుభకార్యాల నిమిత్తం నూతన వస్తు, వాహన, వస్త్రాభరణాల కోసం ధనవ్యయం చేస్తారు. ఇంటాబయట వేధింపులు తగ్గుతాయి. కళా, క్రీడాకారులు తమ ఆధిక్యతను పొందగలరు. ఇరుగు పొరుగువారితో సఖ్యతవసరం. స్త్రీలతో మాట పట్టింపులుంటాయి.




కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

క్రిందిస్థాయి ఉద్యోగులకు పై అధికార ఒత్తిడులు వుంటాయి. నూతన కార్యక్రమాలపై దృష్టి పెడతారు. క్రమంగా ఆర్థికస్థితి మెరుగౌతుంది. నిరుద్యోగులు మాత్రం నిరుత్సాహం చెందకండి. విద్యార్థులు ఉత్సాహంగా తమ పనులు చేపడతారు. ఆస్థి వివాదాలకు పరిష్కారం కనుగొంటారు. శుభకార్యాలలో పాల్గొంటారు. ఒక సమస్యపై అనుకోని ధన వ్యయం జరుగుతుంది.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

ఉద్యోగులకు పైఅధికారుల నుండి పలు సమస్యలు, ఒత్తిడులుంటాయి. వృత్తి, వ్యాపారాలలో పరస్పర అవగాహన అవసరం. ఆర్థిక లావాదేవీలు అంతంత మాత్రం. పనులలో జాప్యం, ఆకస్మిక ప్రయాణాలు, దూరపు బంధువులతో ఉత్తర ప్రత్యుత్తరాలు, పలు సభలు, సమావేశాలలో పాల్గొనుట, కుటుంబ వ్యక్తులతో శుభకార్యాలలో పాల్గొనుట వుంటుంది. ఆకస్మిక ధన లాభం.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

తమ కన్నా తక్కువ వారిని చూసి ఈర్ష్య, అసూయ ద్వేషాలు, తరచుగా మతిమరుపుతో పొరపాట్లు దొర్లే అవకాశాలున్నాయి. గృహ వాతావరణంలో మిశ్రమ ఫలితాలు, తోటివారితో మిత్రశత్రుత్వాలుంటాయి. స్వంత వారి నుండి వ్యతిరేకత, విముఖత వుంటుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. ప్రముఖులతో పరిచయాలు, సమాజంలో గౌరవాభిమానాలుంటాయి.

వారఫలాలు

తేది 12-10-2013 నుండి 18-10-2013 వరకు మేషంలో కేతువు; మిథునంలో గురువు; సింహంలో కుజుడు; కన్యలో రవి 17తేది వరకు తదుపరి తులలో; తులలో బుధ, శని, రాహువులు; వృశ్చికంలో శుక్రుడు; ధనుర్మకర, కుంభ, మీనాలలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

12తేది దుర్గాష్టమి.
13తేది మహర్నవమి, విజయ దశమి.
14తేది షిర్డి సాయిబాబా సమాధి ఉత్సవం.
16తేది బక్రీద్ పండుగ (ఈద్-ఉల్-జుహా)
17తేది తులా సంక్రాంతి.
18తేది వాల్మీకి జయంతి, శరత్పౌర్ణమి.

శుభ ముహూర్తాలు

12, 13, 14, 15, 16, 17, 18 తేదీలలో వివాహ, గృహప్రవేశ, వ్యాపారారంభ, ఉపనయన, అక్షరాభ్యాస, కేశఖండనాలు మరియు సామాన్య విషయాలకు సుముహూర్తాలున్నాయి.

అక్టోబర్ తిథులు
ఆశ్వయుజ శుద్ధ

12	శని	అష్టమి	ప	03.25గం.ల.వ
13	ఆది	నవమి	ప	01.16 గం.ల.వ
14	సోమ	దశమి	ప	11.14 గం.ల.వ
15	మంగళ	ఏకాదశి	ప	09.22గం.ల.వ
16	బుధ	ద్వాదశి	ఉ	07.45గం.ల.వ
17	గురు	త్రయోదశి	ఉ	06.27గం.ల.వ
		చతుర్దశి	తె	05.32గం.ల.వ
18	శుక్ర	పౌర్ణమి	తె	05.06గం.ల.వ

అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం
7/34, దొడ్ల సుబ్బారెడ్డి నగర్, నవలాకులతోట, నెల్లూరు – 2. సెల్: 95819 76599.



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా వుంటాయి. బాధిత రుణాలు తీరుతాయి. ఆగిన ఇంటి నిర్మాణ పనులు తిరిగి చేపడతారు. వ్యవహారాలు అనుకూలిస్తాయి. స్థిరాస్తి, భూ వివాదాలు ఒక కొలిక్కి వస్తాయి. విద్యార్థులు ఉత్సాహంగా ఉంటారు. వ్యవసాయదారులకు అనుకూలం. కళా, క్రీడాకారులు ఉత్సాహంగా వుంటారు. వృత్తి, వ్యాపారులు మంచి పురోగతి సాధిస్తారు.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

నూతన పరిచయస్తులతో మాట్లాడేటప్పుడు పలు జాగ్రత్తలవసరం. గుడ్డిగా నమ్మి మోసపోతారు. వృత్తి, వ్యాపార, ఉద్యోగులకు సామాన్య ధనాదాయం. సమాజంలో గౌరవాభిమానాలుంటాయి. అసంతృప్తిగా వున్న పనులు పూర్తి చేస్తారు. బంధుమిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమౌతాయి. రావలసిన బాకీలు వసూలౌతాయి. ముఖ్య అవసరాలు తీరుతాయి. కుటుంబ ఒత్తిడులు తగ్గుతాయి.



ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

కోపాన్ని, అహంకారాన్ని విడనాడాలి. తద్వారా మిత్రశత్రుత్వాలు అధికమౌతాయి. స్త్రీలకు ఆరోగ్య విషయమై తగు జాగ్రత్తలవసరం. కుటుంబంలో అపార్థాలు చోటుచేసుకొంటాయి. క్రీడా, కళాకారులు అసంతృప్తికి లోనౌతారు. ఆరోగ్యం సామాన్యం. పురస్కార, తిరస్కారాలుంటాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. బంధువులతో వివాదాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనడం మేలు చేస్తుంది.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

రుణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి. సోదరీ, సోదరులు, మిత్రులతో స్వల్ప వివాదాలుంటాయి. నిరుద్యోగుల ఉద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. వృత్తి, వ్యాపారాలు నత్తనడక నడుస్తాయి. కొన్ని ఆశ్చర్యకర సంఘటనలు మిమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. శుభకార్యాల మూలంగా ధన వ్యయం. ఆదాయానికి తగ్గ ఖర్చులు. కళా, క్రీడాకారులు ఆర్థికంగా నిలదొక్కుకొంటారు.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

వృత్తి, వ్యాపారాలు అనుకూలించి ఆర్థిక పురోగతి సాధిస్తాయి. నూతన వస్తు సేకరణ, ఉద్యోగులకు అధికారులతో సదవగాహన, వ్యవసాయదారులకు అనుకూలం. విద్యార్థులు తమ అభిలాషను నెరవేర్చుకొంటారు. కళా, క్రీడాకారులకు అధికారులతో స్వల్ప విభేదాలు. వస్తు, వాహన లాభాలు, నూతన కార్యచరణ పట్ల అభిమతం. క్రమేణా ఆర్థిక పరిస్థితి మెరుగౌతుంది.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

తలపెట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. ఆర్థికపరిస్థితి మెరుగౌతుంది. అవసరానికి డబ్బు చేతికందుతుంది. వృత్తి, వ్యాపారాలలో అనుకూలతలు సాధిస్తారు. వారం మధ్యలో ధన వ్యయం. ఇంటా బయట బాధ్యతలు, దైవదర్శనాలు, ఆచార వ్యవహారాలు పాటించాలి. నూతన వ్యాపారంలో పెట్టుబడులు పెట్టినా లాభమే. ఎన్ని అనుకూలతలున్నా నిత్యం ఆందోళన, గజిబిజిగా వుంటుంది.

యజమానిపై ప్రభావం చూపే తూర్పు గృహ అవాస్తు దోషాలు!

టి.వైజయంతి బుచ్చి

** మొదట యజమాని, తర్వాత స్త్రీ సమస్యలనెదుర్కొన్నారు. ఎందువల్ల?*

తూర్పు గృహ అవాస్తు దోషాలు యజమానిపై దాడి చేశాయి. యంత్ర ప్రతిష్ట తర్వాత అవి నిమ్మళించాయి. తర్వాత ఉత్తర, దక్షిణ దోషాలు విజృంభించి స్త్రీ సమస్యను ఉత్పన్నం చేశాయి.

కెటిఎన్ సికింద్రాబాద్

** పిల్లలిద్దరూ చాలా 'పెద్ద' వారైపోయారు. ఇంత 'మూర్ఖత' ఎలా వచ్చింది.*

'శనితిష్ట' వేస్తే ఇలాగే జరుగుతుంది. నిర్ధారిత యంత్రాన్ని వెంటనే ప్రతిష్టించుకోండి. పెంపకం లోపమని ఇప్పుడు బాధపడి ప్రయోజనం లేదు. 'నవగ్రహ' పూజ సమస్యను పరిష్కరిస్తుంది.

ఎన్.పల్లవీరెడ్డి కర్నూలు

** ప్రహరీ గోడల వల్ల కూడా అరిష్టం జరుగుతుందా?*

దక్షిణ, పశ్చిమాల్లోని ప్రహరీ నిర్మాణాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. నైరుతి, నిరుతి స్థానంలో 'భూగర్భం'లో 'గోళాకృతి బెడ్' వల్ల చాలా మేలు జరుగుతుంది.

ఎం.ఎం.ఆర్ నాయుడుపేట

** నెమ్మదిగా వుండేవాడు కోపతాపాలకు పోయి గొంతు మీదకు తెచ్చుకున్నాడు?*

వాస్తు దోషాలలో 'కుజగ్రహ' తీవ్రత సమస్యను జటిలం చేస్తుంది. కోపం పైగా 'శాడిజం' మీవాడిలో వున్నాయి. కుజాగ్రహం గృహ సమస్యలకే పరిమితం. మీవాడు అనాలోచితంగా సమస్యను తెచ్చుకున్నాడు. నిర్దుష్ట యంత్ర ప్రతిష్ట చేయండి.

జిఎన్.రెడ్డి నెల్లూరు

** నవరత్నంగుళీయం ధరించిన తర్వాత వ్యాపారం తగ్గిపోయింది.*

వ్యాపారమే కాదు. ఆరోగ్యం కూడా పాడవుతుంది. రెండురాళ్లే మనిషి, అయిదురాళ్లు ఋషులు, తొమ్మిదిరాళ్లు రాక్షసులు ధరించాలన్నది ఒక సూక్తి!

జె.మిత్రవింద కర్నూలు

** 'వాస్తు ప్రభోధిని' సంస్కృత గ్రంథంలో ఆ మిగతా పేర్లు అర్థం కాలేదు.*

తులసి తర్వాత సబ్జా, ముద్దబంతి, శిఖి పించ మొక్కల వర్ణనలు మీరు చదివారు. తులసి ఆరోగ్య రక్షణ అయిందంటే కారణం అందులోని రసాయనం 'థైమాల్!'

టి.శశికళ కోటారెడ్డిపాళెం

** ఆయనకు ఆరోగ్య సమస్య – పరిష్కారం చెప్పండి?*

వాస్తు దోషాలు సరిచేసుకోవడానికి కొంత కాలం పడుతుంది. ముందు మీరు డాక్టరును సంప్రదించండి. ఇంద్ర స్థానం (తూర్పు) భ్రష్టతకు యంత్ర ప్రతిష్ట చాలా అవసరం. శ్రీవారి గురించి భయపడాల్సిందేమీ లేదు.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

ఖాసిం అలీఖాన్ మహ్మద్ హైదరాబాద్

** గృహాన్ని అమ్మేయాలనుకొంటున్నాను. అలా చేయవచ్చా?*

వాస్తు దోషాల్ని సరిచేసి గృహాన్ని అమ్మవచ్చు. దోష నివారణ చేయకపోతే ఇప్పుడు పడుతున్న అవస్థలకు మించి బాధలు కొనితెచ్చుకొంటారు.

జివిజి.రెడ్డి శ్రీకాళహస్తి

** ఇప్పుడేమైనా చేయగల వారున్నారంటే మీరొక్కరే!*

అందితే జుట్టు, లేకపోతే కాళ్ళు అనే సామెత మీలాంటి వారి వల్లే వచ్చి వుంటుంది. నైరుతి, ఆగ్నేయ స్థానాల్ని ఇప్పటికైనా సరిచేసుకోండి. అనారోగ్యం, మృత్యువును తప్పించుకోగలుగుతారు.

ఎన్.శ్రీనివాసులు గూడూరు

** శాస్త్రం ఎంత బలవత్తరమైనదో మీనుండే గ్రహించాను.*

ఇంతకు క్రితం వెక్కిరించి ఇప్పుడు శాస్త్రం తల్లివంటిదంటున్నారు. అందుకు సంతోషం. వాస్తు శాస్త్రం సౌకర్యాల గురించే చెబుతుంది. 'యంత్ర ప్రతిష్ట' వల్ల బాగుపడ్డారంటున్నారు. అందుకు సంతోషిస్తున్నాను.

వై.అరుంధతి అనంతపురం

** 'దోషాలు' తగులుతాయా? శాపాలు వున్నాయా?*

వశిష్ట సిద్ధాంత వాస్తువులో మీరు చదివింది

స్తంభించిన కార్పొరేషన్ పాలన!

● నెల్లూరు కార్పొరేషన్ సిబ్బంది సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొంటుండడంతో నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయి. మునిసిపల్ కాళాయిల్లో కలుషిత నీరు సరఫరా అవుతున్నాయి. వీధిలైట్లు వెలగడం లేదు. చెత్త వత్తక పోవడం వల్ల నగరం గబ్బుపట్టిపోతుంది.



పని జరగని నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం.

సమైక్యాంధ్ర ఉద్యమంలో మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొంటుండడంతో పరిపాలన పూర్తిగా స్తంభించింది. కార్పొరేషన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రధానంగా ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో పనుల పర్యవేక్షణ జరగాలి. అధికారులు, కార్యాలయ ఉద్యోగులు సకల జనుల సమ్మె చేస్తున్నారు. ఎన్జీఓలు, రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సమ్మెను ఉధృతం చేశారు. జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ మినహా మిగిలిన అన్ని శాఖల అధికారులు విధులను బహిష్కరించి సమ్మె కొనసాగిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ, రెవిన్యూ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కూడా ఈ సమ్మెలో వుండడంతో రేషన్ షాపులకు సరఫరా కావాల్సిన సరుకులు రవాణా కావడం కొంత ఆలస్యం జరిగింది. దీనిని ఆసరా చేసుకొన్న రేషన్ షాపు డీలర్లు సరుకుల్ని ప్రక్కదారి మళ్లిస్తున్నారు. గత రెండు నెలల నుండి అమ్మ హస్తం పథకంలో భాగంగా పంపిణీ చేయాల్సిన 9 రకాల నిత్యావసర సరుకులు లబ్దిదారులకు అందకుండాపోయాయి. కొన్ని మండలాల్లో పారిశుధ్య సిబ్బంది చేత పనులు చేయిస్తున్నా అవి పూర్తి స్థాయిలో జరగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో రోజుల తరబడి చెత్తను తొలగించడం లేదు. ఇటీవల నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో సమీప గ్రామ పంచాయతీలను విలీనం చేసింది ప్రభుత్వం. విలీనం కాబడిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత కార్పొరేషన్ అధికారులదే. కాని ఇందుకు కార్పొరేషన్ అధికారులు పెద్దగా స్పందించడం లేదు. సమైక్యాంధ్ర ఉద్యమం పేరుతో అధికారులు తప్పించుకొంటున్నారని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదు. రెగ్యులర్ సిబ్బంది సమ్మె చేయడంతో కాంట్రాక్టు సిబ్బంది ద్వారా అరకొరగా పనులు జరుగుతున్నాయి. రాత్రిపూట వీధిలైట్లు వేసేందుకు ప్రతి డివిజన్‌లో ఒకరిని నియమించుకున్నారు. వారికి గౌరవ వేతనంగా నెలకు వెయ్యి రూపాయలు చెల్లిస్తుంటారు. ఎలక్ట్రికల్ ఏఇ, సూపర్‌వైజర్లు వీధిలైట్లు వెలుగుతున్నాయా? లేదా అని పరిశీలించాలి. తనిఖీలు లేకపోవడంతో వీధిలైట్లు వెలిగించేవారు లేకుండా పోయారు. మునిసిపల్ కొళాయిల్లో కలుషితమైన నీరు సరఫరా అవుతోంది. తాగునీటి సరఫరా కోసం వేసిన పైపులు పగిలి డ్రైనేజి కాల్వల నీరు కలుషితం అవుతోంది. దుర్వాసన రావడం గమనించకుండా తాగుతున్నారు. శివారు ప్రాంతాల ప్రజలు కొందరు జ్వరాల బారినపడి ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

కార్పొరేషన్ పరిధిలో పనులు నిలిచిపోవడంతో ప్రజలు ఏం చేయలేని పరిస్థితి. జనన, మరణ ధృవీకరణ పత్రాలు జారీకి మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నా వాటిని ఆమోదించే అధికారం కార్పొరేషన్ అధికారికే వుంది. సమ్మె కారణంగా వందలాది దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయి. జనన, మరణ ధృవీకరణ పత్రాల కోసం మీ సేవా కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. కార్పొరేషన్ పరిపాలన స్తంభించి పోవడంతో రావాల్సిన పన్నులు సైతం నిలిచిపోయి కార్పొరేషన్ ఆర్థిక ఇబ్బందుల్లో పడింది.

మాయాజాలం

● సమ్మె పేరుచెప్పి

రేషన్ సరుకులను మాయం చేస్తున్న డీలర్లు!

సమైక్యాంధ్రకు మద్దతుగా చేస్తున్న సమ్మెలో పౌరసరఫరాల శాఖ, రెవిన్యూ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొంటుండడంతో రేషన్ షాపులకు సరుకులు ఆలస్యంగా సరఫరా అవుతున్నాయి. దీన్ని అదునుగా చేసుకొని డీలర్లు సరుకులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు.



మూతబడ్డ రేషన్ షాపు.

జిల్లాలో గత రెండు నెలల నుండి సమైక్యాంధ్ర ఆందోళనలు జరుగుతున్నాయి. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఆగష్టు 12 నుండి సకల జనుల సమ్మె చేస్తున్నారు. ఎన్జీఓలు, రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సమ్మెను ఉధృతం చేశారు. జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ మినహా మిగిలిన అన్ని శాఖల అధికారులు విధులను బహిష్కరించి సమ్మె కొనసాగిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ, రెవిన్యూ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కూడా ఈ సమ్మెలో వుండడంతో రేషన్ షాపులకు సరఫరా కావాల్సిన సరుకులు రవాణా కావడం కొంత ఆలస్యం జరిగింది. దీనిని ఆసరా చేసుకొన్న రేషన్ షాపు డీలర్లు సరుకుల్ని ప్రక్కదారి మళ్లిస్తున్నారు. గత రెండు నెలల నుండి అమ్మ హస్తం పథకంలో భాగంగా పంపిణీ చేయాల్సిన 9 రకాల నిత్యావసర సరుకులు లబ్దిదారులకు అందకుండాపోయాయి. కొన్ని మండలాల్లో కొన్ని సరుకులను తూతూ మంత్రంగా లబ్దిదారులకు పంపిణీ చేసి, మరికొన్ని చోట్ల సరుకులు అందలేదని చెప్పి చేతులెత్తేశారు డీలర్లు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్ని స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు బియ్యంతోపాటు ఇతర సరుకులు సరఫరా చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చెబుతున్నారు. వాస్తవంగా గ్రామీణ ప్రాంతాల్లో సరుకులు అందని పరిస్థితి ఏర్పడింది. సకల జనుల సమ్మె కారణంగా సరుకుల రవాణాకు జాప్యం ఏర్పడినప్పటికీ లబ్దిదారుల అవసరాలు దృష్టిలో వుంచుకొని సరుకులు అందించాలని అధికారులు నిర్ణయించారు. బయట మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగిపోయాయి. జిల్లాలో జరుగుతున్న ఆందోళనల కారణంగా సామాన్య ప్రజల జీవనోపాధికి కొంత ఇబ్బంది ఏర్పడింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ప్రారంభం కాకపోవడంతో పనులు లేక జనం ఇళ్ల వద్దనే వుంటున్నారు. మొన్నటి వరకు ఉపాధి హామీ పథకం ద్వారా కూలీ పనులు చేసి జీవనం సాగించే కూలీలకు ఆ పనులు కూడా లేకుండా పోయాయి. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సరుకులు తెచ్చుకొనేందుకు వెళితే నో స్టాక్ అంటూ డీలర్ల నుండి సమాధానం రావడంతో వెనుదిరుగుతున్నారు. రేషన్ షాపులు తనిఖీ చేసేవారు లేకపోవడంతో సరుకులు బ్లాక్ మార్కెట్‌కు తరలించేస్తున్నారు.

అధికారులు సమ్మెలో వుండడం రేషన్‌షాపు డీలర్లు సరుకులను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం లబ్దిదారుల పాలిట శాపంగా మారింది. అసలే కూలీ పనులు లేక ఖాళీగా వుంటున్న ఎస్సీ, ఎస్టీలు జీవనోపాధి గురించి పట్టించుకునేవారు లేకుండా పోయారు. ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ షాపులకు సరఫరా కాబడిన సరుకులు లబ్దిదారులకు అందుతున్నాయా లేదా అన్న దానిపై జాయింట్ కలెక్టర్ దృష్టి సారించాల్సిన అవసరం వుంది.



హీరోయిన్‌గా రాజశేఖర్ కుమార్తె!

నటన వారసత్వంగా తెలుగు పరిశ్రమలో పరిఢవిల్లుతుంది. గతంలో ఎందరో వారసులు వెండి తెరపై మెరిసిన చందంగానే హీరో రాజశేఖర్ ఇంటి నుంచి ఓ హీరోయిన్ వస్తుంది. రాజశేఖర్, జీవితల గారాలపట్టి శివాని చిత్రరంగ ప్రవేశం గూర్చి కొంతకాలంగా వార్తలు వినవస్తున్నాయి. ఈసారి ఆమె ఎంట్రీ ఖాయమయ్యింది. త్వరలో జీవిత దర్శకత్వంలో ఓ చిత్రం రూపుదిద్దుకోనుంది. ఇందులో శివానీ కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమాకు 'వందకు వంద' అనే పేరు పెట్టారట. దీనిలో రాజశేఖర్ కూడా ఓ ప్రత్యేక పాత్రలో కనిపిస్తారు. చిత్రసీమలో ఫ్యామిలీ మల్టీస్టారర్‌ల హంగామా మొదలయ్యింది. ఆ జాబితాలో 'వందకు వంద' సినిమా చేర్చాలేమో?

గడసరి కరీనా!

హీరోయిన్ కరీనాకపూర్ ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా రోడ్డు మీద నడుచుకొంటూ వెళ్తుంటే ఆమె వాలకం చూసి గర్భవతిగా ఉందేమోననే సందేహంతో ఒక ఛానల్ వాళ్లు కలిసి మేడమ్... మీరు గతంలో పిల్లల్ని కననీ, సైఫ్ అలీ పిల్లల్నే నా పిల్లలుగా భావిస్తాననే చెప్పారు కదా? ఇప్పుడేమన్నా మీ మనసు మార్చుకున్నారా? అని ప్రశ్నించారు. కరీనా పకపకా నవ్వేసి అబ్బే ఆ నిర్ణయం ఏమీ మారలేదు. ఇప్పుడు ఓ సినిమా కోసం గర్భవతిగా నటిస్తున్నానంతే అంటూ వివరించింది. ఛానల్ వాళ్లు రెట్టించి మీకు ఇలాంటి సన్నివేశంలో నటిస్తున్నప్పుడు తల్లిని కావాలనే భావనా కలగదా? అని మరో ప్రశ్న విసిరారు. దీనికి కరీనా తాపీగా సమాధానమిస్తూ ఇది కేవలం నటనేగా! అయినా థ్రిల్లింగానే ఉంది. నేను ఒక చిన్నారి పాపను తెచ్చి పెంచుకుంటాను. అలా నా కోరిక తీరుతుంది. తల్లి కావాలంటే బిడ్డని కనాలా? అంటూ గడుసుగా జవాబిచ్చింది.





ఆది పినిశెట్టి, తాప్సీల మధ్య ప్రేమాయణం మొదలైందా? గత కొంత కాలంగా టాలీవుడ్‌లో చక్కర్లు కొడుతున్న వార్త ఇది. వీరిద్దరూ కలసి 'గుండెల్లో గోదారి' సినిమాలో నటించారు. అప్పటి నుంచి స్నేహం మొదలైందని, అదే ప్రేమగా మారిందని చెప్పుకొంటున్నారు. అయితే ఈ వార్తలను తాప్సి తిప్పి కొట్టింది. ఆది నాకు మంచి స్నేహితుడు అంతే. అంతకు మించి మా ఇద్దరి మధ్య ఏమీ లేదు. వ్యక్తిగతంగా మాట్లాడుకొంటాం. దానికి పెడార్థాలు తీయొద్దు. ప్రేమపై నాకు మంచి అభిప్రాయమే ఉంది. అయితే ప్రేమలో పడిపోవాలని లేదు కదా? ఆ సమయం ఇంకా రాలేదంటోంది తాప్సి. నమ్ముదామా?

ప్రేమలో పడలేదు!


ఇలియానా కసరత్తులు



బర్ఫీ విజయంతో ముచ్చట పడిపోయిన ఇలియానాకు ద్వితీయ విఘ్నం ఎదురైంది. బాలీవుడ్‌లో ఆమె నటించిన ఫటా పోస్టర్ సిక్లా హీరో బాక్సాఫీసు దగ్గర బోల్తా పడింది. పైగా ఇలియానాపై ఈ సినిమాతో కొత్తగా మార్కులేం పడలేదు. అంతే కాదు ఈ సినిమాలో ఇలియానా బాగా చిక్కిపోయినట్లు కనిపిస్తోందని ఇంత పీలగా ఉంటే అవకాశాలు ఎలా వస్తాయని? అక్కడ విమర్శకులు ఘాటుగానే రాసేశారు. బాలీవుడ్ కోసం ఇలియానా భారీ కసరత్తులు చేసింది. బాలీవుడ్‌లో రాణించాలంటే స్లిమ్‌గానే ఉండాలి అని కబుర్లు చెప్పింది. ఆ విషయంలో అతి చేయడం వల్ల మొదటికే మోసం వచ్చేసింది. మరో ప్లాప్ నెత్తి మీద వేసుకొంటే ఇలియానా ఇక వెనక్కు రావడం తప్పదంటున్నారు.

అందం, నటన ఈ రెండింటిలోనూ తానేమిటో నిరూపించుకొంది విద్యాబాలన్. పాత్రకు తగ్గట్టుగా తన రూపురేఖలు మార్చుకోగలదు. 'ది డర్టీ పిక్చర్' కోసం బరువు పెరిగింది. ఘన్ చక్కర్ కోసం సన్నబడింది. షాదీ కా సైడ్ ఎఫెక్ట్ సినిమా కోసం మళ్లీ ఒళ్లు చేసింది. ఇప్పుడు అమ్మడి కొత్త సినిమా కోసం సన్నాహాలు జరుగుతున్నాయి. మోహిత్ సూరి దర్శకత్వంలో ఓ సినిమా చేయడానికి ఇటీవలే తన అంగీకారం తెలిపింది. ఇందులో ఇమ్రాన్ హష్మీతో కలసి ఆమె ఆడిపాడబోతోంది. పాత్ర రీత్యా సినిమాలో విద్యా బాలన్ కాస్త నాజూగ్గా కనిపించాలట. అందుకే మళ్లీ కసరత్తులు మొదలు పెట్టింది. దర్శకుడు చెప్పకముందే... భారీస్థాయిలో బరువు తగ్గిందట. ఆ విషయం గూర్చి బాలీవుడ్‌లో చర్చించుకొంటున్నారు. పా, ది డర్టీ పిక్చర్, కహానీ లాంటి వైవిధ్యమైన సినిమాలతో విద్యాబాలన్ పేరు హిందీ పరిశ్రమలో మార్మోగిపోయింది. ఆ మధ్య వచ్చిన ఘన్ చక్కర్ ప్రేక్షకులను అంతగా మెప్పించలేకపోయింది. అందుకే ఈసారి విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.

నాజూగ్గా విద్యాబాలన్!





సినిమాలపైనే దృష్టి!

నేనింకా ఎదగాల్సిన అమ్మాయిని. అప్పుడే ప్రేమ, పెళ్లంటూ పెద్ద పెద్ద మాటలు నాకొద్దు. ప్రస్తుతం నా దృష్టంతా సినిమాలపైనే అంటోంది యామీగౌతమ్. విక్కీ డోనర్ సినిమాతో అందరి దృష్టినీ ఆకర్షించింది ఈ ముద్దుగుమ్మ. ఈమె ప్రస్తుతం హిందీతోపాటు తెలుగులోనూ సినిమాలు చేస్తోంది. నితిన్ హీరోగా 'కొరియర్ బాయ్ కళ్యాణ్' అనే చిత్రంలో నటిస్తుంది. హీరోయిన్లంతా ప్రేమలో పడుతున్నారు. మరి మీ కథేమిటి? అని అడిగితే ప్రేమ, పెళ్లి అనే విషయాలు కేవలం తెరకు మాత్రమే పరిమితం. వాటి గూర్చి ఆలోచించేంత ఓపిక, సమయం నాకు లేవు. పైగా ఆ వయసు కూడా నాకు రాలేదు. నాకు తెలిసింది మూడే విషయాలు. ముంబై – హైదరాబాద్ – చెన్నై. ఈ నగరాల చుట్టూనే తిరుగుతున్నా. అది కూడా సినిమాల కోసమే అని సెలవిచ్చింది ఈ ముద్దుగుమ్మ.

బహు ప్రత్యేకతల బాహుబలి!



ఛత్రపతి తర్వాత ప్రభాస్‌తో ఎస్.ఎస్. రాజమౌళి తీస్తున్న బాహుబలి చిత్రంలో పలు ప్రత్యేకతలున్నట్లు కృష్ణానగర్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ, మళయాళ భాషల్లో రూపొందుతోంది. ఈ సినిమాను ఫ్రెంచ్, జపనీస్, స్పానిష్, కొరియన్ భాషల్లోకి అనువదించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సినిమాలో ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్నాడంటున్నారు. బాహుబలిని రెండు భాగాలుగా తీర్చిదిద్దుతారట. 150 కోట్ల రూపాయలతో తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెట్టింగ్స్ చూసి రామోజీ ఫిల్మ్ సిటీ అధినేత రామోజీరావు ఆశ్చర్యపోయి రాజమౌళికి వ్రాసిన అభినందన లేఖను ట్విట్టర్ పోస్ట్ చేశాడు రాజమౌళి.

రవీనా దడబడలు

సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టిన హీరోయిన్లు చాలా మందే ఉన్నారు. వాళ్లలో రవీనా టాండన్ ఒకరు. దశాబ్దం క్రితం తన అందచందాలతో కుర్రకారును ఒక ఊపు ఊపేసింది రవీనా. మధ్యలో కాస్త విరామం తీసుకొంది. బుడ్డా హోగా తేరా బాప్ చిత్రంతో సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టి మళ్లీ విజృంభిస్తోంది. తెలుగుతో పాటు హిందీలోనూ అవకాశాలు అంది పుచ్చుకొంటోంది. బంగారు బుల్లోడు చిత్రం ద్వారా పరిచయమైన రవీనా టాండన్ ఇప్పుడు మోహన్‌బాబుతో కలసి ఓ చిత్రంలో నటిస్తోంది. అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న బాంబే వాలెట్ చిత్రంలో రవీనా కీలక పాత్ర పోషిస్తోంది. ఇందులో ఆమె జాజ్ సింగర్‌గా కనిపించనుందట. ఈ కథ మొత్తం బొంబాయి నగరం చుట్టూ తిరుగుతుంది. రణబీర్‌కపూర్ – అనుష్క శర్మ జంటగా నటిస్తున్నారు. దీంతోపాటు రవీనా చేతిలో మరికొన్ని సినిమాలు వున్నాయి.



జయకుమార్‌రెడ్డిని కలిస్తే అంతే!



● అనుచరులకు వివేకా బెదిరింపు

రూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డికి, ఆయన సోదరుడు మాజీ కార్పొరేటర్ జయకుమార్‌రెడ్డి మధ్య వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఇద్దరి మధ్య ఏర్పడిన పొరపచ్చాలు పెరిగి ఇప్పుడు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితికి వచ్చింది. ఆనం వివేకానందరెడ్డి, ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలపై జయకుమార్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో ఆయన వెంట నడిచేవాళ్లు, మద్దతు దారులపై ఆనం వివేకా నిఘా పెట్టడంతోపాటు అలాంటి వారికి తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తున్నాడట. ఏమనుకొంటున్నారు పెద్ద నాయకులై పోయారా? ఆయనేమన్నా పెద్ద నాయకుడా? తమాషాలు చేస్తే మీ సంగతి తేలుస్తా అంటూ వివేకానందరెడ్డి తనదైనశైలిలో పెద్ద నోరేసుకొని తిడుతుండడంతో చోటా మోటా నేతలు భయపడి పోతున్నారు. గతంలో మునిసిపల్ వ్యవహారాలలో ఆనం జయకుమార్‌రెడ్డి పెత్తనం నడిచేది. అప్పటి నుంచి నగరంలోని పలు డివిజన్ల కార్పొరేటర్లు ఆయనతో టచ్‌లో ఉండేవాళ్లు. వివిధ కాంట్రాక్టు పనులు దగ్గర్నుంచి పోలీస్ కేసుల వరకు జయకుమార్‌రెడ్డి చూసేవాడు. వివేకాకు ఆయనకు మధ్య నెలకొన్న విబేధాలతో మధ్యలో కార్పొరేటర్లు, నేతలు నలిగి పోతున్నారు. జయకుమార్‌రెడ్డి ఫోన్‌చేసి కార్యక్రమాలకు ఆహ్వానిస్తుండడంతో మొహమాటంతో రానని చెప్పలేక, వెళ్తే వివేకానందరెడ్డి తిట్లు భరించలేక పోతున్నారు. గోడ దెబ్బ, చెంప దెబ్బలా వుంది వీరి పరిస్థితి. ఇద్దరు అన్నదమ్ములు, రేపు తిరిగి కలిసిపోతే మధ్యలో మేము బలైపోతామేమోనన్న ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు మరికొందరు మాజీ కార్పొరేటర్లు. మొత్తం మీద వివేకాకు, జయకుమార్ రెడ్డికి మధ్య ఏర్పడిన తగాదా కాంగ్రెస్ నేతలు, మాజీ కార్పొరేటర్లకు తలనొప్పిగా పరిణమిస్తోంది.

దేశభక్తి గీతాల పోటీ



సభలో మాట్లాడుతున్న రూరల్ డిఎస్పీ బాల వెంకటేశ్వరరావు.

గాంధీ జయంతిని పురస్కరించుకొని నెల్లూరులోని సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక టౌన్‌హాల్‌లోని వర్ధమాన సమాజం గ్రంథాలయం మిద్దె మీద దేశభక్తి గీతాల పోటీ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు రూరల్ డిఎస్పీ కె.బాలవెంకటేశ్వరరావు, నగర పాలక సంస్థ కమిషనర్ డి.జాన్ శ్యాంసన్, సామ్రాట్ క్లినిక్ అధినేత డాక్టర్ ఎం.సుధాకర్, ముది గొండ శ్రీనివాసులు, సమైక్యాంధ్ర ఉపాధ్యాయ జెఎసి జిల్లా అధ్యక్షులు ఆర్వీరాఘవనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూరల్ డిఎస్పీ బాలవెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి జాతిపిత మహాత్మాగాంధీ లాంటి మహనీయులు సరికొత్త వెలుగులు ప్రసాదించారని తెలిపారు. పోటీల్లో సీనియర్ విభాగంలో అభినందన, జె.వసుంధర, వి.విశ్వేశ్వరశర్మ, జూనియర్స్‌లో వి.మనస్విని, ఎ.శ్రీవాణి, ఎన్.సుమంత్ విజేతలుగా నిలిచారు. కార్యక్రమాన్ని సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక దగ్గుపాటి రాధాకృష్ణ విజయవంతంగా నిర్వహించారు.

ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టారు!



స్కూటర్ ర్యాలీలో తెలుగు తమ్ముళ్లు.

● సమైక్యాంధ్ర ర్యాలీలో బీద రవిచంద్ర

దేశం నుండి సోనియా గాంధీ, రాష్ట్రం నుండి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబాలను వెళ్లగొట్టే వరకు తెలుగుదేశం పార్టీ అవిశ్రాంతంగా పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర హెచ్చరించారు. కేంద్ర కేబినెట్‌లో టి-నోట్ ప్రవేశపెట్టి ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ 4వ తేది తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని అగౌరవపరిచే విధంగా విభజన జరిగిందన్నారు. సీమాంధ్రలో తెలుగు ప్రజలు 65 రోజులుగా చేస్తున్న ఉద్యమాన్ని కనీసం పరిగణనలోనికి తీసుకోకుండా టి-నోట్ ప్రవేశపెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. సీమాంధ్రలో జగన్మోహన్‌రెడ్డి, తెలంగాణలో కెసిఆర్ అండ చూసుకుని ఈ విభజన జరిగిందని ఇది పూర్తిగా కుట్రపూరిత ఒప్పందంలో భాగమన్నారు. కేంద్ర మంత్రులు ఈ వ్యవహారంలో దద్దమ్మలుగా మారారన్నారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ధర్మవరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● ప్రపంచ స్థాయి యోగా పోటీలకు

కిషోర్ రత్నం స్కూల్ విద్యార్థిని!



జ్యోష్ణవిని అభినందిస్తున్న రామ్మూర్తినాయుడు.

నెల్లూరు సరస్వతి నగర్‌లోని డాక్టర్ కిషోర్ రత్నం హైస్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్న వై.జ్యోష్ణవి అక్టోబర్ 13వ తేది పారిస్‌లో జరిగే 25వ ప్రపంచ యోగా ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక య్యి ప్రపంచస్థాయిలో సింహపురి కీర్తిబావుటా ఎగురవేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన జ్యోష్ణవి అభినందన సభలో స్కూళ్ల జి.ఎం.రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ ప్రపంచ యోగా ఛాంపియన్ షిప్ పోటీలకు భారతదేశం నుండి 15 మంది ఎంపిక కాగా వారిలో దక్షిణ భారతదేశం నుండి ఒక్కరు ఎంపిక కావడం అది జ్యోష్ణవి కావడం హర్షనీయమన్నారు. తమ విద్యా సంస్థలలో చదివే విద్యార్థులను వారికి ఇష్టమైన అంశాలలో ప్రోత్సహించడం స్కూల్ అధినేతలు డాక్టర్ కిషోర్, వాసంతి అలవాటన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషోర్ రత్నం జెన్ నెక్స్ట్ స్కూల్ సీనియర్ మేనేజర్ రమేష్‌బాబు, సిఇఓ సంయుక్త, ప్రిన్సిపాల్ వసుంధర, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ కోసం నిరీక్షణ

గ్యాస్ ఏజెన్సీలు సక్రమంగా గ్యాస్ బండను సరఫరా చేయకపోవడం వలన వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. గ్యాస్ అవసరమైన వారు బుక్ చేసుకున్న తర్వాత పది రోజుల్లోగా సరఫరా చేస్తామని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. చెప్పిన వ్యవధికంటే మరో వారం రోజులు గడిచినా కూడా గ్యాస్ పంపిణీ జరగడం లేదు. ఏజెన్సీ కార్యాలయానికి ఫోన్‌చేసినా సరైన సమాధానం రావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. జిల్లావ్యాప్తంగా హిందూస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పేర్లతో గ్యాస్ ఏజెన్సీలున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీని వినియోగదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ప్రకటించింది. ఇందుకు ఆధార్ సంఖ్యను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయించుకోవాలని ప్రకటించడంతో అనేక మంది ఈ విధానాన్ని పాటించారు. గ్యాస్ ఏజెన్సీల పనితీరుపై పర్యవేక్షణ చేసే వారు లేకపోవడంతో నిర్వాహకులు, అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు, గ్యాస్ సరఫరా జరుగుతున్న విధానంపై తనిఖీలు చేపట్టి వినియోగదారులు ఇబ్బందులు చూడాల్సిన అవసరం వుంది. ప్రస్తుత పరిస్థితిలో గ్యాస్‌కు డిమాండ్ అధికంగా వుంది. దీనిని ఆసరా చేసుకుని బ్లాక్ మార్కెట్‌కు తరలించే ప్రమాదం వుంది.

రుణాల రికవరీకి వత్తిడి

బ్యాంకుల్లో వివిధ అవసరాల నిమిత్తం రుణాలు పొందిన వారు గత మూడు నెలల నుండి సక్రమంగా చెల్లింపులు చేయలేక పోయారు. రాష్ట్ర విభజన ప్రకటనకు వ్యతిరేకంగా ప్రభుత్వ ఉద్యోగులు సమ్మె చేస్తున్నారు అధికారులు, సిబ్బంది. విధులకు హాజరుకాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం సమ్మె కాలానికి జీతం చెల్లించడం లేదు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు కుటుంబ పోషణ కోసం అనేక ఇక్కట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్న వారి బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించాలంటూ బ్యాంకు అధికారుల నుండి ఒత్తిడి వస్తున్నట్లు కొందరు సిబ్బంది

ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు

ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రక్క సమ్మె కొనసాగడం, మరోప్రక్క వేతనాలు అందక ఆర్థికంగా చితికిపోతున్నారు. కేవలం నెలసరి వేతనం మీద ఆధారపడి జీవనం సాగించే ఉపాధ్యాయులు, ఆర్టీసి కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వీరికి ప్రస్తుతం అప్పులు ఇచ్చేవారు కూడా దొరకడం లేదని వాపోతున్నారు. ఇటువంటి క్రమంలో బ్యాంకులో పేరుకుపోయిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ రావడంతో ఏమిచేయాలో పాలుపోవడం లేదని అంటున్నారు. బ్యాంకు నిబంధనల ప్రకారం ప్రతినెల వేతనంలో బకాయిలను నేరుగా బ్యాంకు ఖాతాకు జమ చేసేవారు. సమ్మె కారణంగా ఖజానా శాఖ పనిచేయక పోవడంతో బ్యాంకు ఖాతాకు వేతనం జమ కాకపోవడంతో బ్యాంకు అధికారులు రుణ గ్రహీతలకు ఫోన్‌చేసి బకాయిల గురించి ప్రశ్నిస్తున్నారు. బకాయిలపై ఉన్నతాధికారులు స్పందించి కొంత వెసులుబాటు కల్పించే విధంగా సహకరించాలని సిబ్బంది కోరుతున్నారు.

ఎక్సైజ్ శాఖ ప్రేక్షకపాత్ర

గాంధీ జయంతి రోజూ బ్రాందీషాపులు

మద్యం విక్రయాలకు సంబంధించి ఎక్సైజ్ శాఖ జారీచేసే ఆదేశాలు జిల్లాలో అమలు కావడం లేదు. బెల్టు షాపుల తొలగింపు, ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు జరపాలని ఆదేశాలున్నాయి. వీటితోపాటు గాంధీ జయంతి, స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్‌డే నాడు మద్యం షాపులు పూర్తిగా మూసివేయాలి. కానీ ఏ ఒక్కటి కూడా చిత్తశుద్ధితో అమలు చేయడం లేదు ఆ శాఖ అధికారులు. మద్యం షాపులు, బార్లకు ముందు రోజు సీల్ వేసినప్పటికీ సెలవుదినం నాడు రహస్యంగా మద్యం విక్రయాలు చేయిస్తున్నారు నిర్వాహకులు. మామూలు రోజు కంటే అదనపు ధరకు విక్రయిస్తుంటారు. ఈ విషయం ఎక్సైజ్, పోలీసులకు ముందుగా తెలిసినప్పటికీ నిర్వహకులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక గ్రామీణ ప్రాంతాల్లో వీధివీధికి బెల్టుషాపులు వెలిసి సామాన్య ప్రజల కుటుంబాల్లో చిచ్చుపెడుతున్నాయి. జాతీయ రహదారి ప్రక్కనున్న డాబాల్లో మద్యం విక్రయాలుగానీ, సేవించడంగానీ చేయరాదంటూ పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నా కిందిస్థాయిలో వీటిని పట్టించుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మామూళ్లు అందుతున్న కారణంతో బెల్టుషాపులు, డాబాల్లో జరుగుతున్న మద్యం విక్రయాలు నియంత్రించలేక పోతున్నట్లు సమాచారం. సాధారణ రోజుల్లో మద్యం షాపుల బయట, రోడ్డు ప్రక్కన మద్యం సేవిస్తుండడం వలన దారిన వెళ్లే వారికి ఇబ్బందికరంగా మారింది. ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ఎక్సైజ్ శాఖ జారీచేసే ఆదేశాలు అమలు చేస్తే మంచిది.

సణుగుడు

16వ పేజీ కొరవ

ఆయనకు? డిజిపి పదవిని చిన్న బుచ్చుతున్నాడా యన.

నెల్లూరు జిల్లా నుంచే డిజిపి హోదాలో రిటైర్ అయిన ఆంజనేయరెడ్డి గారున్నారు. అధికారం వుం దని ఏనాడూ అహంకారం చూపలేదాయన. పైగా తన పదవిని కొన్ని వందల కుటుంబాలలో దీపం వెల్గించడానికి ఉపయోగపెట్టాడు. రిటైర్ అయిన తర్వాత కూడా ఆయనకు అటు పోలీసు శాఖలో, ఇటు పౌర సమాజంలో వృత్తిలో వున్నప్పటి గౌరవ మర్యాదలే లభిస్తున్నాయి. అధికారి అంటే అట్లా వుండాలి. దినేష్‌రెడ్డి గారికి ఆ సూక్ష్మం తెలియక పోతే ఆంజనేయరెడ్డి గారి దగ్గర శిక్షణ తీసుకోవడం మంచిది.

కొట్లాట పరమ నీచం

మొదటి పేజీ కొరవ

నాలి. కానీ ఆయన ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చొని ఆందోళనను నడిపిస్తున్నాడు. చరిత్రలో ఏ ముఖ్య మంత్రీ ఇటువంటి దుస్సాహసం చేయలేదు. ముఖ్య మంత్రి పదవి ఆషామాషీ ఉద్యమం కాదు. రాజ్యాం గం దానికి విశేష అధికారాన్ని, బాధ్యతను కట్ట బెట్టింది. రాష్ట్రంలో ప్రజా జీవనం సాఫీగా జరిగేట్లు చూడవలసిన బాధ్యత ముఖ్యమంత్రిదే. కానీ కిరణ్ కుమార్‌రెడ్డి ప్రజా జీవనాన్ని విధ్వంసం చేస్తున్నాడు.

ఎపిఎన్జీఓ సంఘం ఆయన చేతిలో ఒక తోలు బొమ్మ అన్న నిజం అందరికీ తెలుసు. వారిని ఉద్యమానికి పురికొల్పింది, అండగా నిలుస్తున్నదీ ఆయనే అనీ తెలుసు. దాచి పెడితే దాగని సత్యం అది. ఆయన లక్ష్యం ఏమిటో మాత్రం ఎవరికీ అర్థం కావడం లేదు. తన స్వంత ప్రయోజనం కోసం ఉద్యోగ సంఘాలను అడ్డుపెట్టుకొని అరాచకం సృష్టి స్తున్నాడాయన. ఏ ఉద్యమంలో అయినా విద్యుత్, ఆస్పత్రులు, పాలు, మంచినీళ్ల వంటి అత్యవసర సేవలకు ఆటంకం ఎదురైతే ప్రభుత్వం ప్రత్యా మ్నాయ చర్యలు చేపట్టడం రివాజు. అది బాధ్యత కూడా. కానీ ఆరు రోజులుగా రాష్ట్రం అంధకా రంలో అలమటిస్తుంటే వినోదం చూస్తున్నాడు ముఖ్యమంత్రి. తూతూ మంత్రంగా చర్చలు జరిపి నట్లు నటించడం తప్ప చిత్తశుద్ధితో ప్రజల కష్టా లను తీర్చే ప్రయత్నం చేయడం లేదు.

మరొకప్రక్క ఉద్యమం పెడదారి పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఎపిఎన్జీఓ సంఘ అధ్యక్షుడు అశోక్‌బాబు రాష్ట్రంలో సివిల్ వార్ వస్తుందని బెదరిస్తున్నాడు. సివిల్ వార్ అంటే ఆ పెద్ద మనిషికి అర్థం తెలుసో లేదో మనకు తెలియదు కానీ, అటువంటి విపరీత పోకడలు పోతున్నా ప్రభుత్వం వారిని నియంత్రించే ప్రయత్నం చేయకపోవడం మాత్రం ఘోరమైన నేరం.

ఉద్యమ నేతలు చేస్తున్న ప్రసంగాలు, హెచ్చు రికలు రాష్ట్రంలోని రెండు ప్రాంతాల మధ్య తీవ్ర మైన మానసిక అఘాతం సృష్టిస్తున్నాయి. ప్రజల మధ్య కొట్లాట కల్పిస్తున్నాయి. రాష్ట్రం విడిపోయినా, కలిసి వున్నా సామాన్యుడి జీవితంలో వచ్చే తేడా ఏమీ లేదు. కొద్దిమంది వ్యాపారులు, భూ కామం దులు, ఉద్యోగులు, రాజకీయవాదుల ప్రయోజనం మాత్రమే ఇమిడి వుంటుంది ఇటువంటి నిర్ణయా లలో. కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తే రెండు ప్రాం తాలలోని ప్రజలు ఒకరినొకరు శత్రువుల వలె చూసుకొనే ప్రమాదం కన్పిస్తున్నది. అది చిన్న ప్రమా దం కాదు. దాని ప్రభావం కొన్ని తరాలపాటు వుం టుంది.

ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి రాజకీయ అనుభవ శూన్యుడు. ప్రజలతో ఆయనకు సంపర్కం చాలా తక్కువ. తన స్వంత నియోజకవర్గం దాటి ఎప్పుడూ బయట ప్రపంచం చూసినవాడు కాదు. ఇటువంటి సున్నితమైన అంశాల మీద ఆయనకు అవగాహన లేదు. అందువల్లనే ఈ తీరులో వ్యవహ రిస్తున్నాడు. ఈ పోకడతో ప్రజలను పెడదారి పట్టి స్తున్నాడు.

ఈ ఉద్యమం ఇంకా కొనసాగితే రాష్ట్రంలోని ఉభయ ప్రాంతాలు, వాటిలోని ప్రజలు వూహకం దని కష్టనష్టాలు అనుభవించవలసి వస్తుంది. దుర దృష్టవశాత్తు కాంగ్రెస్ అగ్ర నాయకత్వం కూడా హ్రస్వ దృష్టితో వ్యవహరిస్తున్నది. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవడంలో విఫలమౌతున్నది. ఉద్యమం ఇంత ఉధృతంగా నడిచేటప్పుడు తెలంగాణ ఏర్పాటు సాఫీగా జరగడం అసాధ్యమన్న నిజం వారికి అర్థం కావడం లేదా లేక ఎవరేమై పోయినా తమ మాట నెగ్గించుకోవాలన్న మొండి పట్టుదలతో వ్యవహరిస్తు న్నారా అన్నది అర్థం కావడం లేదు. కేంద్ర ప్రభు త్వం కళ్లు తెరవకుంటే చాలా అనర్థాలు జరుగు తాయి.

ఈ సమస్యకు పరిష్కారం – ఇరు ప్రాంతాల ప్రజలకు నచ్చ చెప్పే, మెప్పించే ప్రయత్నం మొదలు పెట్టడం. అది చర్చల ద్వారా కావచ్చు, అఖిల పక్ష సమావేశం కావచ్చు, కమిటీలు, కమిషన్లు కావచ్చు. ఏది వీలైతే ఆ పద్ధతిలో సామరస్య వాతావరణం నెలకొల్పడానికి ప్రయత్నం మొదలు కావాలి. ఆం ధ్రుల అభ్యంతరాలు ఏమిటన్న సమాచారం కూడా తెలుసుకోకుండా మూర్ఖపు పట్టుదలతో రాష్ట్రాన్ని విభజించాలనుకొంటే మాత్రం జరిగేది వినాశనం మాత్రమే.

అయోమయంలో చంద్రబాబు!

మొదటి పేజీ కొరవ

మం ఉవ్వెత్తున ఎగసి పడుతున్నది. విభజనవాదు లకు రేపటి ఎన్నికలలో పుట్టగతులు వుండవన్న భీతి గొల్పుతున్నది.

దానితో చంద్రబాబు అయోమయంలో పడి పోయాడు. తెలంగాణ అనుకూలం అన్న మాటను వెనక్కు తీసుకోలేదు. అటువంటి ప్రయత్నం వల్ల తెలంగాణలో పార్టీ నాశనం కావడంతోపాటు, మొత్తం రాష్ట్రంలోనే నిలకడలేని, మాట నిలుపు కోలేని నేతగా భ్రష్ట పట్టవలసి వస్తుంది. అట్లని మొండిగా తెలంగాణ వాదనే విన్పిస్తే ఆంధ్రలో జనం తిరగబడేట్లున్నారు. ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న పరిస్థితిలో పడిపోయాడు. తన విధా నం ఏమిటో తనకే తెలియని గందరగోళంలో మునిగి పోతున్నాడు.

రాష్ట్రం శ్రేయస్సు కోసం ఢిల్లీలో నిరాహార దీక్ష చేస్తున్నాడిప్పుడు. అరవైఏళ్లు దాటిన తర్వాత ఆమరణ దీక్ష ప్రాణానికే ప్రమాదం. కానీ పార్టీని నిలబెట్టుకోవడానికి అంతకు తెగించక తప్పలేదు. అయితే దీక్ష లక్ష్యం ఏమిటి, ఎవరు ఏ హామీ ఇస్తే దీక్ష విరమించాలి అన్న స్పష్టత లేదు. తెలంగాణ ఏర్పాటు వద్దని కోరలేదు. ఆంధ్రుల అభ్యంతరాలు విస్మరించమనీ కోరలేదు. రెండు ప్రాంతాలలో పార్టీని బ్రతికించుకోవాలని తాపత్రయం. కానీ పరిస్థితి చూస్తుంటే రెండింటికీ చెడిన రేవడిగా మిగిలేట్లు న్నాడు.

అంతటి రాజకీయ అనుభవం, రాజనీతిజ్ఞత, వ్యూహ రచనా పాటవం కల్గిన చంద్రబాబుకు కూడా ప్రస్తుత సమస్యకు పరిష్కారం ఏమిటో బోధపడడం లేదంటే, తానుగా ఒక మార్గాన్ని సూచించ లేక పోతున్నాడంటే, సమైక్యాంధ్ర ఉద్యమం ఎంత జఠిలంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

లపై తాను రౌడీయిజం చేయలేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ జిల్లా కన్వీనర్ మేరిగ మురళి వివరణ ఇచ్చారు. సమైక్య ఉద్యమకారుల్లో ఒకడైన తన మిత్రునితో మాట్లాడిన విషయాన్ని తానంటే గిట్టని వాళ్లు రౌడీయిజం చేసినట్లు ప్రచారం చేశారన్నారు. తాను ఎంత ఎదిగినా ఒదిగి ఉండే రకమని 'జమీన్ రైతు' ప్రతినిధికి మేరిగ మురళి స్పష్టం చేశారు.

రూప్‌కుమార్ అతి!

నెల్లూరులో మాజీ కార్పొరేటర్ రూప్‌కుమా ర్‌ను వైకాపా నగర ఇన్‌ఛార్జ్ అనిల్‌కుమార్ యాద వ్‌కు బాగా ఇష్టుడు. ఆ పార్టీ నేతృత్వంలో జరిపే కార్యక్రమాల్లో రూప్‌కుమార్ ఎంత అతి చేసినా ఎవరూ ఆయన్ను అదుపు చేయరు. సమైక్యాంధ్రకు మద్దతుగా జగన్మోహన్‌రెడ్డి దీక్షలో కూర్చొన్నారని ఆ పార్టీ 6వ తేది ఉదయం ట్రాక్టర్లు, ఆటోలతో నగర దిగ్బంధనం చేసిన సమయంలో రూప్‌కుమార్ ఆయన అనుచరులు అత్యవసరంగా వెళ్లాల్సిన ప్రజ లతో సైతం వాదనకు దిగడం సమర్థనీయమని పించ లేదు. రూప్‌కుమార్‌ను బహిరంగ ఉద్య మాల్లో అదుపు చేయాల్సిన బాధ్యత అనిల్‌నే స్వీక రించక తప్పదు. కాదు బంధువనుకొంటే భవిష్య త్తులో ఆయన సృష్టించే సమస్యలకు అనిల్‌కు చెడ్డ పేరు తప్పదు.

జిల్లా అదనపు వైద్యాధికారిణి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదనపు వైద్యాధి కారిగా డాక్టర్ కె.కోటీశ్వరి 3వ తేది బాధ్యతలు చేపట్టారు. ఈమె స్వస్థలం వెంకటగిరి. ఇక్కడే క్లస్టర్ వైద్యశాలలో ఎస్సీ హెచ్ఓగా ఆమె పనిచేస్తుండగా ప్రమోషన్ వచ్చింది.

నగదు బదలీకి మూడు నెలల గడువు!

జిల్లాలో నగదు బదలీ పథకం అమలు చేయను మరో మూడు నెలలు గడువు పొడిగిం చారు. జిల్లాలో 5.30 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా 2.15 లక్షల మందినే ఆధార్ కార్డుల ప్రక్రియలో పాల్గొన్నారు. వీరిలోనూ లక్షా పదివేల మందే తమ ఆధార్ కార్డుల నెంబర్లు బ్యాంకులలో నమోదు చేసుకొన్నారు. వీరిలో 80వేల మంది ఖాతాల్లో గ్యాస్ సబ్సిడీ మొత్తం జమ కూడా అయ్యింది. అందరూ బ్యాంకుల్లో ఆధార్ కార్డుల నమోదుకు వీలుగా మరో మూడు నెలలు గడువిస్తూ జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకొన్నారు.

వెంకటేశ్వర్లుకు డాక్టరేట్



స్వామి వివేకానంద – వ్యక్తి యొక్క గౌరవం – ఆత్మను గుర్తించడం అనే అంశంపై పరిశోధన చేసి నందుకు శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ కె.వెంకటే శ్వర్లుకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన మనుబోలు మండలం లక్ష్మీనర సాపురంలో గల ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు.

వివేకా చేతిలో పిస్టల్

సెక్యూరిటీ వద్దని గతంలో గన్‌మెన్‌లను తిప్పి పంపిన రూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకా నందరెడ్డి వున్నట్లుండి చేతిలో పిస్టల్ పట్టుకొని తిరగడం చర్చనీయాంశమయ్యింది. ఇటీవల వైకాపా ఆనం సోదరుల ఇంటి ముట్టడికి పిలుపు నిచ్చిన సందర్భంలో పోలీసులు వివేకా, రామ నారాయణరెడ్డి ఇంటి వద్ద ఇనుప కంచె ఏర్పాటు చేయడంతోపాటు పారామిలటరీ దళాలతో బందోబస్తు, ఫైర్ ఇంజన్‌లను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా వివేకానందరెడ్డి తనకు గల లైసెన్స్ తుపాకిని పేపర్‌లో చుట్టి కనిపించీ కనిపించ కుండా వున్నట్లు చేతిలో పట్టుకుని తిరుగుతూ ఫోటోలకు ఫోజులిచ్చాడు. తర్వాత ఆయన అది పిస్టల్ కాదని డబ్బులని సహజ ధోరణిలో బుకా యించాడు.

తెలంగాణ నోట్ తర్వాత బంద్ బిర్రుగా జరిగింది

కేంద్ర మంత్రివర్గం తెలంగాణ ముసాయిదా నోట్‌కు ఆమోదం తెలిపినందుకు నిరసనగా 4, 5 తేదీల్లో జిల్లాలో 48 గంటలపాటు జరిగిన బంద్ బిర్రుగా జరిగింది. సామాన్యులకు కూడా బాధను కలిగించి బంద్‌లో సంపూర్ణంగా పాల్గొనేట్లు చేసింది.

జనవాణి

2వ పేజీ కొరవ

లను అతిక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ కడుతున్నారు. రోడ్డు మీదకు వచ్చిన ఈ నిర్మాణానికి కార్పొరేషన్ అధికారులు ఏ విధంగా అనుమతిచ్చారో అర్థం కావ డం లేదు. ఈ ప్రాంతంలో ఇప్పటికే లెక్కకు మించి వున్న కళ్యాణ మండపాలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్ వల్ల తరచూ ట్రాఫిక్ నిలచిపోతున్నా ఈ వ్యవహా రాన్ని పరిగణనలోకి తీసుకోకుండా అనుమతివ్వడం సబబుకాదు.

దర్గామిట్టవాసులు నెల్లూరు

మోక్షమెప్పుడు?

చట్టసభలలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించదలచిన బిల్లు రాజ్యసభలో 2010వ సం వత్సరంలో ఆమోదం పొందినా లోక్‌సభలో ఇంత వరకు ప్రవేశపెట్టలేదు. యూపిఏ ప్రభుత్వ నేతలు ఇతరప్రతిపక్షనేతలతో చర్చించి వారికున్న అభ్యంతరా లను అధిగమించడానికి ఏం చేయాలో 2014 ఎన్ని కల ముందు ఆమోదించుకొనే ఉద్దేశ్యం గాని, తొం దర గానీ లేనట్లు కనపడుతున్నది. ఈ 33 శాతంలో మైనార్టీలకు కొంతభాగం కేటాయించాలని ప్రతిపక్ష నాయకులు కోరుతున్నారని, పురుషాధిక్యం పోయి స్త్రీల సంఖ్య పెరుగుతుందని, అందువల్లే లోక్‌సభ సీట్ల సంఖ్య పెంచాలన్న వాదనలు వినపడుతున్నాయి. ఈబిల్లు తమహయాంలో ఆమోదం పొందగలదనే ఆశ యూపిఏ ప్రభుత్వానికి లేనట్లు వుంది.

డి.సుభాషిణి నెల్లూరు

పదరంగం -88

నిర్వహణ : బాబాజీ

1		2	3			4	■	5	■
	■	6		■	■	7			8
■	9		■	10			■	11	
■	12		13		■	■	14	■	
15		■		■	16	17			■
	■	18			■	19		■	20
21	22		■	■	23			24	■
■	25		26	27	■	■	28		29
30	■	31			■	32	■	33	
34		■	35			■	36		

అడ్డం

1. అరచేతిలోని ఉసిరిక (7)
6. పిసినారి తనం (2)
7. విశాఖపట్టణంలోని ప్రసిద్ధ ప్రాంతం (4)
9. ఎల్లప్పుడు (2)
10. ఇంగ్లీషు శక్తి (3)
11. దేవలోకపు బాతు (2)
12. కమల నేత్రి (4)
15. మార్గం, దోవ (2)
16. ఓటమి (4)
18. ఇంటి ముంగలి (3)
19. పండు కాదు (2)
20. అడ్డం 34కి ముందు చేరిస్తే ఓడ నడిపేవాడు (1)
21. మోడల్, మాదిరి (3)
23. పాపడు, చిన్న పిల్లవాడు (4)
25. కారణం కలిగి వుండడం (4)
28. అటునుంచి పది మైళ్ల దూరం (3)
31. ఓడను తీరంలో నిలిపేది (3)
32. ఇంగ్లీషు, హిందీలలో కూడా మూడో నంబరు (1)
33. అటునుంచి వినమని చెప్పడం (2)
34. తెలుగు కలర్ (2)
35. తడబడిన ఉడత (3)
36. తడబడిన ఎడమ (3)

నిలువు

1. కవిత వ్రాసినవాడు (2)
2. ఎవరిదారి వారిదే (4)
3. నష్టం కాదు ప్రాఫిట్ (2)
4. ఆస్ట్రేలియా దేశపు జంతువు (3)
5. పెండ్లి (3)
8 ఇంటి చెత్త (3)
9. వాహన యోగం (3)
10. విహంగము (2)
13. జనకుని కుమార్తె (3)
14. కృష్ణా తీర పట్టణం (5)
15. దగ్గర, సమీపం (3)
17. రాక్షసి, రక్కసుని భార్య (3)
18. వానలుపడే కాలం (4)
22. బొమ్మలు, వస్తువులు తయారు చేసే అచ్చు (2)
24. గ్రాండ్‌సన్ క్రింద నుంచి వస్తున్నాడు (4)
26. గడబిడ గొడవ (3)
27. క్రింద నుంచే మంచి సమయం (3)
29. ఆమె (3)
30. ఒడ్డు (2)

సమాధానాలు

పదరంగం -87

[1]ప	ర	[2]వ	[3]శం	■	[4]పా	రి	జా	[5]త	[6]ము
ది	■	[7]శ	క	లం	■	■	■	[8]మా	ల
■	[9]చ	ము	రు	■	[10]క	లి	కి	■	క
■	ద	■	[11]డు	రు	ని	■	■	[12]పీ	■
[13]ఆ	రం	[14]భం	■	■	■	[15]క	[16]ని	క	[17]ట్టు
■	[18]గం	గి	రె	[19]ద్దు	■	[20]మ	గ	■	గ
[21]ప	■	మ	■	[22]ప	[23]ది	లం	■	[24]మా	■
ర	■	[25]లు	చే	■	శ	■	[26]క	రు	[27]వు
[28]ప	[29]గం	■	■	[30]క	లు	[31]వ	■	[32]తి	రు
[33]తి	రో	గ	మ	నం	■	[34]శం	క	■	ప

● **ఇత్తడి పాత్రలో నిల్వ చేసిన నీళ్లు...**

క్రిమిరహితమని శాస్త్రబద్ధంగా తేలింది!

అభివృద్ధి చెందుతున్న బీద దేశాలలో తాగే నీళ్లలో శుభ్రత లోపించినందున ఎన్నో లక్షల మంది డయేరియా, టైఫాయిడ్, జాండీస్ వంటి రోగాల బారిన పడుతున్నారు. ఈ దేశాలలో ప్రతి ఏటా దాదాపు 20 లక్షల మందికి పైగా చిన్నారులు ఒక్క డయేరియాతోనే మరణిస్తున్నారు. ఇందుకు విరుగుడు తాగేనీళ్ల రోగ కారకాలైన క్రిమిరహితంగా వుండటమే. ప్రభుత్వాలు ఎన్నో మంచినీటి పథకాలను ఏర్పాటు చేస్తున్నారు. కానీ ఆ నీళ్ల అన్ని చోట్లా వ్యాధికారక క్రిమిరహితమని చెప్పలేము. ఒక్కొక్కసారి మునిసిపాలిటీ సరఫరా చేసే నీళ్లే మురికిగా వుంటుంటాయి. నీళ్లను ఇంటి వాడుకకు వీలుగా శుభ్రంగా క్రిములు లేకుండా చేయటానికి రకరకాల "ఫిల్టర్లు" మార్కెట్‌లో ఉన్నాయి. అవి చాలా ఖర్చుతో కూడుకొన్నాయి. ఆ ఖర్చు భరించగలవారు చాలాకొద్ది మంది మాత్రమే. సామాన్యులకు అలివికాదు. కాచుకొని తాగడం సులువే. కానీ ఇది కూడా ఖర్చుతో కూడుకొన్నదే. ప్రతి చోటా వీలుకాదు.


క్రిమిరహితమైన నీళ్ల తయారు చేసుకోటానికి శాస్త్రజ్ఞులు ఒక ఖర్చులేని పద్ధతిని కనిపెట్టారు. ఇది పాతకాలంలో మాదిరి నీళ్ల నిల్వ

టి.కె.రెడ్డి
విశ్రాంత మునిసిపల్ ఇంజనీర్, నెల్లూరు.

వుంచటానికి ఇత్తడి పాత్రలను వాడటం. ఒక సారి ఒక బిందెను కొంటే జీవితకాలం వుంటుంది గదా! ఇప్పుడు ఖరీదు తక్కువని ప్లాస్టిక్, స్టీలు బిందెలు వాడుతున్నారు. రాత్రిపూట రాగి పాత్రలో నీళ్లుపోసి వాటిని ఉదయాన తాగుతుంటారు కొందరు. ఇది ఆరోగ్యానికి మంచిదంటారు. రాగి, జింకుల మిశ్రమమే ఇత్తడి.

ఇత్తడి పాత్రలో నీళ్లు ఆరు గంటలకు తక్కువ కాకుండా నిల్వ ఉంచితే ఆ నీళ్లు పూర్తిగా వ్యాధిక్రిమిరహితమవుతాయి. నెల్లూరు గర్వపడతగిన శాస్త్రజ్ఞుడు డాక్టర్ జగదీష్ గారు వారి లేబరేటరీలో పరీక్షించి పై పద్ధతి పని చేస్తుందని తేల్చారు. అందువలన ఈ పద్ధతిని అవలంభించి ఎవరైనా తాగటానికి యోగ్యమైన నీరు పొందవచ్చు. సామాన్యంగానే తాగే నీళ్ల శుభ్రంగా వుంచటానికి కొన్ని జాగ్రత్తలు తీసుకొంటే సరిపోతుంది.

ఇత్తడి పాత్రను చిలుము, మురికి లేకుండా ప్రతిదినం శుభ్రపరచాలి, పాత్రలెప్పుడూ మూత పెట్టి దుమ్ము, ధూళి పడకుండా వుంచాలి. నీళ్ల తోడుకోవటానికి ప్రత్యేకంగా ఒక లోటా వుంచితే ఉత్తమం.



రైతు లోకం

ఖరీఫ్‌కి అనువైన వరి రకాలు!

గతవారం తరువాయి భాగం

పార్థివ (NLR 33892) : పంటకాలం 155 రోజులు. ఎకరానికి రెండున్నర టన్నుల దిగుబడి వస్తుంది. అగ్గి తెగులును తట్టుకుంటుంది. చేను మీద పడిపోదు. ముదురు వేసినా దిగుబడి తగ్గదు. ఒకే వరిపంట సాగుచేసే ప్రాంతాలైన దక్షిణ, కృష్ణా మండలాలకు అనువైన రకం.

శ్రీకూర్మ (RGL 2332) : పంటకాలం 150 నుంచి 155 రోజులు. ఎకరానికి 2.1 టన్నుల దిగుబడి వస్తుంది. ఉల్లికోడు, అగ్గితెగులు, ముంపును తట్టుకొంటుంది. సన్నబియ్యం.

స్వర్ణముఖి (NLR 145) : పంటకాలం 135 రోజులు. ఎకరానికి 3.2 టన్నుల దిగుబడి వస్తుంది. అగ్గి తెగులు, నీటి ఎద్దడిని, చౌడుని తట్టుకుంటుంది. ముదురు వేసినా దిగుబడి తగ్గదు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో చెరువుల క్రింద, కాలువల క్రింద ఒకే పంట పండే ప్రాంతాలకు బాగా అనుకూలమైన రకం.

తెల్ల హంస : పంటకాలం 125 రోజులు. ఎకరానికి రెండున్నర టన్నుల దిగుబడి వస్తుంది. అగ్గి తెగులు, ఎండాకు తెగులుని, పెరిగే దశలో చలిని కూడా తట్టుకొంటుంది. గింజ పొడవుగా నాణ్యత కలిగి వుంటుంది. స్థిరమైన దిగుబడినిచ్చే రకం. తెలంగాణ జిల్లాలలో సాగుకి అనువైన రకం.

కావ్య (WGL 48684) : పంటకాలం 135 రోజులు. ఎకరానికి రెండున్నర టన్నుల దిగుబడి వస్తుంది. ఉల్లికోడు తట్టుకుంటుంది. బియ్యం సన్నం.

పొలాసప్రభ (JGL 384) : పంటకాలం 135 రోజులు. ఎకరానికి రెండున్నర టన్నుల దిగుబడి వస్తుంది. ఉల్లికోడు తట్టుకుంటుంది. గింజ సన్నం, నాణ్యత కల్గినది.

వరంగల్ సన్నాలు (WGL 32100) : పంటకాలం 135 రోజులు. ఎకరానికి రెండున్నర టన్నుల దిగుబడి వస్తుంది. సన్న బియ్యం, అగ్గి తెలుగు వస్తుంది.

జగిత్యాల సాంబ (JGL 3844) : పంటకాలం 125 రోజులు. ఎకరానికి మూడు టన్నుల దిగుబడి వస్తుంది. ఉల్లికోడు, చలిని తట్టుకుంటుంది. చేనుపై పడిపోదు. గింజ రాలదు.

వంశధార (RGL 11414) : పంటకాలం 150 రోజులు. ఎకరానికి మూడు టన్నుల దిగుబడి వస్తుంది. ఉల్లికోడు, అగ్గి తెగులును తట్టుకుంటుంది. చేను మీద పడిపోదు. గింజ నాణ్యత కల్గినది. స్వర్ణ రకాన్ని పోలి వుంటుంది. స్వర్ణకి ప్రత్యామ్నాయంగా సాగు చేయవచ్చు.

డాక్టర్ వై.సూర్యనారాయణ
ప్రధాన శాస్త్రవేత్త,
వ్యవసాయ పరిశోధనా స్థానం, నెల్లూరు.

జగిత్యాల మసూరి (IGL 114704) : పంటకాలం 135 రోజులు. ఎకరానికి మూడు టన్నుల దిగుబడి వస్తుంది. ఉల్లికోడు తట్టుకుంటుంది. అగ్గితెగులు, పాముపొడ, గోధుమ రంగు మచ్చలు తక్కువగా వుంటుంది. బియ్యం సన్నం, అన్నానికి బాగుంటుంది.

అక్షయ (BPL 2231) : పంటకాలం 150 రోజులు. ఎకరానికి మూడు టన్నుల దిగుబడి వస్తుంది. బియ్యం మధ్యస్థం. చేను మీద పడిపోదు, దోమ, అగ్గితెగులును తట్టుకుంటుంది. ప్రకాశం, గుంటూరు, కృష్ణ మరియు ఖమ్మం లలో సాగుకి సిఫార్సు చేయబడినది.

భావపురి సన్నాలు (BPT 2270) : పంటకాలం 160 -165 రోజులు. ఎకరానికి రెండున్నర టన్నుల దిగుబడి వస్తుంది. అగ్గితెగులు, దోమపోటు తట్టుకుంటుంది. సన్న బియ్యం, అన్నానికి బాగుంటుంది. కృష్ణ, గోదావరి మండలాలలో ఒకే వరి పంట పండే ప్రాంతాలకి అనువైన రకం.

నెల్లూరు సోన (NLR 3041) : పంటకాలం 140 రోజులు. ఎకరానికి మూడు టన్నుల దిగుబడి వస్తుంది. అగ్గితెగులు తట్టుకుంటుంది. సన్నబియ్యం, అన్నానికి చాలా బాగుంటుంది. చౌడు పొలాలలో సాగుచేయవచ్చు. తక్కువ ఎరువులతో అధిక దిగుబడి ఇచ్చే రకం.

కృష్ణా (RNR 2458) : పంటకాలం 145 రోజులు. ఎకరానికి 2.8 టన్నుల దిగుబడి వస్తుంది. సన్నబియ్యం, సార్వాలో సన్న రకాలు సాగు చేసే అన్ని ప్రాంతాలకి అనువైన రకం. అగ్గి తెగులు రాదు, చేను మీద పడిపోదు.

ప్రాణహిత (JGL 11727) : పంటకాలం 140 రోజులు. ఎకరానికి 2.7 టన్నుల దిగుబడి వస్తుంది. ఉల్లికోడు, అగ్గితెగులు, ఎండాకు తెగులును తట్టుకొంటుంది. సన్నబియ్యం. అన్నానికి బాగుంటుంది.

సుగంధ సాంబ (RNR 2465) : పంటకాలం 125 రోజులు. ఎకరానికి రెండున్నర టన్నుల దిగుబడి వస్తుంది. బియ్యం మధ్యస్థ రకంగా వుండి సువాసన గల రకం. ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మొట్టమొదటగా విడుదల చేసిన రకం. మార్కెట్‌లో మంచి ధర వున్నది.

ప్రధ్యుమ్న (JGL 17004) : పంటకాలం 100 రోజులు. ఎకరానికి రెండు టన్నుల దిగుబడి వస్తుంది. అతి స్వల్ప కాలిక పొట్టి రకం. చేను మీద పడిపోదు. నీటి ఎద్దడి వున్న పరిస్థితులలో నేరుగా ఎదబెట్టి సాగుచేయుటకు, పూర్తిగా వర్షాధార పరిస్థితులకు అనువైన రకం. సన్నబియ్యం, ఉల్లికోడు, అగ్గి తెగులును తట్టుకుంటుంది.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14

సంపాదకీయం

* ఉద్యోగులకెందుకంత తుత్తర?
* డిజిపి పదవిని చిన్నబుచ్చిన దినేష్‌రెడ్డి

సమైక్యాంధ్ర ఉద్యమం మొత్తాన్ని తమ భుజాల మీద వేసుకొన్నారు ప్రభుత్వ ఉద్యోగులు. బంట్రోతు నుంచి జాయింట్ కలెక్టర్ హోదా వరకు అన్ని వర్గాల ఉద్యోగులు తమ అబ్బదేదో పోతున్నదన్నంత ఆరాటం ప్రదర్శించారు. జీవన్మరణ సమస్యగా పోరాడుతున్నారు. రెండు నెలలుగా జీతాలు లేకున్నా లెక్క చేయడం లేదు. వారు ముందు నిలవకుంటే అసలు సమైక్యాంధ్ర అభిలాష ఒక ఉద్యమ రూపం సంతరించుకొనేది కాదనడం అతిశయోక్తి కాదు. ఈ డెబ్భై రోజులుగా అన్నీ వారే అయ్యి ఉద్యమం నడిపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయవలసిన అగత్యాన్ని కల్పించారు. ఎంతో శక్తిమంతురాలను కొన్న సోనియాగాంధీ సైతం నివ్వెరపోయేట్లు చేశారు. ఉద్యోగులు ఆ స్థాయిలో నడుం బిగించకుంటే, ఈ పాటికి రాష్ట్ర విభజన సగం మేర జరిగిపోయి వుండేది. ఒకవేళ విభజన నిలిచిపోయినా లేక ఆలస్యం అయినా ఆ ఘనత ప్రభుత్వ ఉద్యోగులకే దక్కుతుంది. ఏ రాజకీయ పార్టీ కూడా ఈ గొప్పను తమకు ఆపాదించుకోలేదు. ఏ రాజకీయ పార్టీకి కూడా విభజన పట్ల ఒక ఖచ్చితమైన విధానం లేదు. నిన్నటి వరకు ఒక మాట, ఇప్పుడో మాట మాట్లాడి, అన్ని రాజకీయ పార్టీలూ ప్రజలలో తమ విలువ, విశ్వాసం కోల్పోయాయి. అందువల్లనే జగన్, చంద్రబాబు దీక్షలు చేపట్టినా జనం పట్టించుకోలేదు. వైఎస్ఆర్ కాంగ్రెస్ సమైక్యాంధ్ర పేరుతో ప్రతి నియోజకవర్గంలో ఆందోళన చేపట్టినా స్పందన రాలేదు. జనం తమంతట తాము వీధులలోకి వచ్చి చేసిన కార్యక్రమాలు మాత్రమే విజయవంతమైనాయి తప్ప రాజకీయ పార్టీలు వేసిన కుప్పి గంతులను ప్రజలు చూసీచూడనట్లు వదిలి పెట్టేశారు. రాజకీయవాదులు, పార్టీల పట్ల ఇంత నిరాదరణ, ఇంత నిర్లక్ష్యం విచిత్రమైన విషయం. వైఎస్‌జగన్ అంటే జనం మనిషి అని పేరు. ఆయన ఎక్కడుంటే అక్కడ గుంపులు చేరుతాయి. జైలు నుంచి బెయిల్ మీద విడుదల అయినా, అదేదో ఘనకార్యమైనట్లు ఘనంగా స్వాగతించారు జనం. కానీ అదే జగన్ సమైక్యాంధ్ర డిమాండ్ పేరుతో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకొంటే అయ్యో పాపం అన్నవాడు లేడు. లోటస్ పాండ్ వద్ద ఆయన ఇల్లు బోసిపోయి కన్పించింది. స్వంత పార్టీ కార్యకర్తల పరామర్శ తప్ప ప్రజల స్పందన దాదాపు శూన్యం. రాజకీయాలంటే జనానికి ఎంత విరక్తిపుట్టిందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.

ఇంతకూ ప్రభుత్వ ఉద్యోగులకు సమైక్యాంధ్ర మీద అంత గాఢమైన మమకారం ఎందుకు కల్గింది? వారేమీ సమాజ సేవ కోసం, శ్రేయస్సు కోసం ఆలోచన చేసే వారు కారు. ఉద్యోగులకు సామాజిక స్పృహ అంటూ వుంటే ఈ దేశం ఈ గతి పట్టి వుండేది కాదు. "నా చిన్ని పొట్టకు శ్రీరామ రక్ష" అనుకొని, తన చుట్టూ ఒక గిరి గీసుకొని, అందులో బ్రతకడం ఉద్యోగి లక్షణం. ఆ చిన్ని పొట్ట చాలా లోతైనది. పానకాల స్వామి బాన వంటిది. ఉద్యోగంలో చేరిన పక్క క్షణం నుంచి, రిటైర్ అయ్యే ఆఖరు నిమిషం వరకు లంచాలతో నింపుకొంటూ పోయినా ఆ పొట్ట నిండదు. ఇంకా ఖాళీ

డోలేంద్ర

వుంటూనే వుంటుంది. ప్రజలను పీడించుకొని బ్రతికే పాపిష్టి జీవులు ప్రజల కోసం ఉద్యమం చేస్తారంటే పాలు త్రాగే పసి పిల్లవాడు కూడా నమ్మడు.

ఉద్యోగుల ఆందోళన కేవలం తమ ఉద్యోగ భద్రత మాత్రమే. హైదరాబాద్ తెలంగాణ రాజధానిగా మారితే, ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారికి బదలీలు తప్పవు. లంచాలు తెగ మెక్కి ఇల్లు వాకిలి కట్టుకొని, మహానగరంలో సుఖంగా బతకడానికి అలవాటు పడిపోయి వారికి, అక్కడ నుంచి కదలాల్సి వస్తుందంటే కంపరం కలగడం సహజం. వారి ఉద్యమ లక్ష్యం కేవలం తమ స్థానాలు స్థిరం చేసుకోవడం మాత్రమే. తెలంగాణ ఉద్యమం కానీ, అంతకు క్రితం జరిగిన జై ఆంధ్ర ఉద్యమం కానీ యువతీ యువకుల ఉద్యోగాల కోసం జరిగాయి. ఇప్పుడు ఉద్యోగుల కోసం జరుగుతున్నది. ఈ రెండింటికి మధ్య చాలా తేడా వుంది.

తమకు బదలీలు రాకుండా, తమ జీవితాలలోని సుఖం కోల్పోకుండా చూసుకోవడం కోసం ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమించారన్నది స్పష్టం. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రత్యక్ష సహకారం, సమర్థన వుండబట్టి వారు ఇంత పెద్ద ఉద్యమాన్ని సునాయాసంగా నడిపించగలిగారు. ప్రభుత్వం ఉద్యమం పట్ల ఏ కొంచెం కఠిన వైఖరి అవలంభించి వుండినా, అత్యవసర సర్వీసులకు ఎస్మా వంటి చట్టాలు ప్రయోగించి వుండినా పరిస్థితి వేరుగా వుండేది.

అయితే సమాజంలో ఐదారు శాతం కూడా లేని ఒక వర్గం కోసం, వారి సుఖం కోసం మొత్తం రాష్ట్ర ప్రజలు ఇన్ని కష్టాలు భరించాలా? ఇన్ని బాధలు అనుభవించాలా? ఒక్క రాజకీయ పార్టీ కానీ, ఒక్క ప్రజా సంస్థ కానీ, ఒక్క మేధావి వర్గం కానీ ఇదేమి న్యాయం అని ఎందుకు ప్రశ్నించలేక పోతున్నారు. ఉద్యోగులకు జీతాలు ఒక్కటే నష్టం. కానీ సాధారణ ప్రజలకు ఈ రెండు నెలలుగా జరిగిన, జరుగుతున్న నష్టాలు కష్టాలు ఎన్నో లెక్కించలేకున్నాము. కరెంట్ లేక పరిశ్రమలు మూతపడుతున్నాయి. బ్యాంకులు లేక వ్యాపారాలు చతికిల పడుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు లేక అన్ని రకాల పనులూ స్తంభించి పోయాయి. జనం నరకం చూస్తున్నారు. సామాన్య ప్రజలే కాదు, వ్యాపారులు, కాంట్రాక్టర్లు, భూములు అమ్ముకోవాలనుకొనే వారు, బ్యాంక్ అప్పుల కోసం ఎదురు చూసే వారు... ఇట్లా పలు వర్గాల ప్రజలు కోలుకోలేనంత నష్టాలలో మునిగి పోతున్నారు. కష్టాలతో కాలి పోతున్నారు.

ఆంధ్ర సమైక్యంగా వున్నా, విభజన జరిగి రెండు రాష్ట్రాలుగా విడిపోయినా సాధారణ ప్రజల జీవితాలలో వచ్చే మార్పులు పెద్దగా వుండవు. హైదరాబాద్ నగరంతో ఆంధ్రలో నివసించే నూటికి తొంభై శాతం మందికి సంపర్కం లేదు. అక్కడ ఆస్తులు లేవు. అవసరాలూ లేవు. హైదరాబాద్ తెలంగాణ భాగానికి వెళ్తే ఆంధ్రులకు ఉద్యోగాలు వుండవని, విద్యావకాశాలు తగ్గిపోతాయని జరిగే ప్రచారం అభూత కల్పన. హైదరాబాదులో లభించే ఉద్యోగాలకు, రాష్ట్ర విభజనకు సంబంధమే లేదు. అక్కడ వుండేదంతా ప్రైవేటు ఉద్యోగాలు మాత్రమే. ఏ ప్రైవేటు సంస్థ కూడా రాష్ట్రం ప్రాతిపదిక మీద ఉద్యోగాలు ఇవ్వదు. ప్రతిభ, అర్హతల ఆధారంగా మాత్రమే నిర్ణయాలు చేస్తుంది. హైదరాబాదు కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ మేనేజిమెంట్ రంగాలలో పని చేస్తున్న వారిలో ఆంధ్రులు, తెలంగాణ వాసులకంటే, ఉత్తరాది వారే ఎక్కువ అన్నది నిజం. కానీ ఉద్యోగ సంఘాలు అబద్దపు ప్రచారాలతో ప్రజలను మోసగించి, ఉద్యమం నడుపుతున్నాయి. లేనిపోని భయాలు రేకెత్తిస్తున్నాయి.

తమ సుఖం కోసం, తమ ఉద్యోగాల భద్రత కోసం ప్రజలను తప్పు దారి పట్టిస్తున్నాయి.

అవినీతి, అసమర్థత, రాజకీయ ప్రలోభాలు, పలుకుబడులతో ప్రజలను జలగల కంటే దారుణంగా హింసించే ప్రభుత్వ ఉద్యోగుల స్వార్థం కోసం ఇన్ని కోట్ల మంది ప్రజలు ఇన్ని అవస్థలు పడాలా? ఏమిటీ అన్యాయం. ఒక్క రాజకీయ పార్టీ కూడా ప్రజలకు నిజాలు చెప్పి, చైతన్యం కల్పించ లేకపోవడం ఎంత దారుణం?

***

డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు అనేది చాలా వున్నత పదవి. హోదాలోనే కాదు, హూందాతనంలో కూడా పేరెన్నిక గలిగింది. ఐపిఎస్ ఉత్తీర్ణులైన వారందరికీ ఆ పదవి దక్కదు. కొందరికే లభించే భాగ్యం అది. కేంద్రంలో అంత కంటే పలుకుబడి, ప్రతిష్ట కల్గిన పదవులు చాలానే వున్నాయి. ఐబి, సిబిఐ, సిఆర్‌పిఎఫ్, సిఐఎస్ఎఫ్ వంటి విభాగాల ఉన్నత స్థానం డిజిపి స్థాయితో సమానమైనదే. కానీ ఐపిఎస్‌లందరూ డిజిపి కావాలని కోరుకొంటారు. అవకాశం వస్తే కేంద్రంలోని పదవులు వదలుకొని మరీ దీనికోసం వచ్చేస్తారు.

దినేష్‌రెడ్డి ఉద్యోగ జీవితం చూసిన వారెవరూ ఆయన డిజిపి కాగలడని కల కూడా కనలేదు. ఆయన సర్వీసు మొత్తం అనామక స్థానాలలోనే గడిచిపోయింది. ఏ ముఖ్యమంత్రి కూడా ఆయన్ను అభిమానించలేదు. నమ్మకం పెంచుకోలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏదోలే అనే సానుభూతితో హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనర్ అవకాశం ఇచ్చాడు. కానీ ఆరు నెలలు తిరిగే సరికి తాను తప్పు చేశానని అర్థం చేసుకొని ఆ పదవి నుంచి తప్పించాడు. దినేష్‌రెడ్డికి కర్నూలు జిల్లాకు చెందిన మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి దగ్గరి చుట్టం. నెల్లూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి సన్నిహిత స్నేహం. వారిద్దరూ పట్టుబట్టి ఆయనకు డిజిపి పదవి ఇప్పించారు. కిరణ్‌కుమార్‌రెడ్డికి అధికారులతో పరిచయం లేదు. ఎవరి పని తీరు ఎటువంటిదో అసలు అవగాహన లేదు. అందువల్లనే దినేష్‌రెడ్డికి డిజిపి అవకాశం ఇచ్చాడాయన. అంతకు క్రితం రోశయ్య మీద ఒత్తిడి పెట్టారు వీరిద్దరూ. కానీ రోశయ్యకు విషయం తెలుసు. అందువల్ల కాదు అనకుండా, పని చేయకుండా కాలం వెళ్లదీశాడు.

తెలిసో తెలియకో కిరణ్‌కుమార్ రెడ్డి ఒక గొప్ప అవకాశం ఇచ్చాడు. పదవి కట్టబెట్టడమే కాదు, పని చేసుకోవడానికి పూర్తి స్వేచ్ఛ కూడా ఇచ్చాడు. ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సు లేఖలు చెత్త బుట్టలో వేసి, తనకు ఇష్టులైన వారిని డిఎస్పీలుగా నియమించుకొన్నా కిరణ్‌కుమార్‌రెడ్డి అభ్యంతరం పెట్టలేదు. ఒకసారి కోర్టు కేసుతో పదవి పోయినా మళ్లీ అవకాశం ఇచ్చాడు. అంత సహాయం చేసినవాడి పట్ల జీవితకాలం కృతజ్ఞతతో మెలగడం మనిషి అన్నవాడు చేసే పని. కానీ దినేష్‌రెడ్డి రిటైర్‌మెంట్ కాగానే, తనను అందలం ఎక్కించిన ముఖ్యమంత్రిని నానా మాటలు అంటున్నాడు. పత్రికలకెక్కుతున్నాడు. పరువు తీయాలని చూస్తున్నాడు. రిటైర్‌మెంట్ తర్వాత తనకు మరొక ఏడాది గడువు పొడిగింపు ఇవ్వలేదని దినేష్‌రెడ్డి కోపం. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఏదో ఒక తీర్పు ప్రకారం తనకు అవకాశం వున్నా ఇవ్వలేదనే కడుపు మంటతో కిరణ్ కుమార్ రెడ్డిని నానా బూతులు తిడుతున్నాడు. పత్రికలకెక్కి గోల చేస్తున్నాడు.

అపకారికి ఉపకారం చేయడం మన పెద్దలు చెప్పిన సంస్కారం. ఉపకారం చేసిన వాడికి అపకారం చేయాలని చూడడం ఎవరూ మెచ్చని కుసంస్కారం. కిరణ్‌కుమార్‌రెడ్డి సమైక్య వాదని, ఆయన తమ్ముడు భూ ఆక్రమణ దారుడని నిందించినంత మాత్రాన వారిద్దరికీ వచ్చే నష్టం ఏదీ లేదు. లక్ష కోట్లు తిన్నాడని లోకం కోడై కూసిన వైఎస్ జగన్‌నే జనం క్షమించి, అక్కున చేర్చుకొంటున్నారు. కిరణ్ ఏదో తప్పు చేశాడని దినేష్‌రెడ్డి చెప్పినంత మాత్రాన ఛీకొడతారా? అటువంటి ఆరోపణలు చేయాలంటే తనకు నైతిక బలం వుందా లేదా అన్న ఆలోచన కూడా చేయలేని వాడు డిజిపి వంటి ఉన్నత పదవికి ఎట్లా వచ్చాడో అర్థం కాని విషయం. తనకు, తన కుటుంబానికి తప్ప దినేష్‌రెడ్డి ఉద్యోగ జీవితం మొత్తంలో ఒకరికి చిన్న పాటి సహాయం చేసి ఎరుగడు. పోనీ, పోలీసు డ్యూటీలో పేరు తెచ్చుకొనే పనులేమైనా చేశాడా అంటే అదీ లేదు. అవినీతిపరుడు కాడు అన్నదే ఆయనకున్న ఏకైక సులక్షణం. కాని అదృష్టం వికటించి, ఆఖరు దశలో అవినీతి ఆరోపణలపై సిబిఐ దర్యాప్తు ఎదుర్కోవలసి వచ్చింది. డిజిపి స్థాయికి చేరుకొన్న అధికారికి అంతకంటే అవమానం వేరొకటి వుండదు. ఆ ఆరోపణలు నిజమా, నిర్ధారణ అవుతాయా కావా అన్నది వేరే విషయం. అసలు అటువంటి పరిస్థితి తెచ్చుకోవడమే పెద్ద దురదృష్టం.

నీళ్లు వదలి బయటకు వచ్చిన మొసలి, రిటైర్ అయిన అధికారి ఒకటే రకం. శక్తి వున్నప్పుడు ఎంత అహంకారం చూపినా చెల్లుబాటు అవుతుంది. పదవీ విరమణ తర్వాత అందరితో మంచిగా వుంటే మనసుకు శాంతి. అందులోను డిజిపి వంటి ఉన్నత స్థానంలో గడిపిన వారు మరింత హుందాగా, వినయంగా, మర్యాదగా వ్యవహరిస్తే సమాజంలో స్థానం మిగులుతుంది. దినేష్‌రెడ్డి డిజిపిగా పోలీసు శాఖకు కానీ, తన పదవికి కానీ ఏమీ ఉపయోగపడ్డాడో నాకు తెలియదు కానీ, ఆ పదవిని అడ్డం పెట్టుకొని కక్ష సాధింపుకు దిగి, శత్రువులను మాత్రం దండిగా సంపాదించి పెట్టుకొన్నాడు. కమలం నీటి బాసిన కమలాక్షుడి రశ్మి సోకి కమిలిపోతుంది. ఆ నిజం తెలుసుకొంటే రిటైర్‌మెంట్ జీవితం ప్రశాంతంగా సాగుతుంది. ఆనం వివేకానందరెడ్డి వంటి విదూషక రాజకీయవాదులు కూడా తన మీద రాళ్లు విసురుతున్నారంటే, తన తీరు సవ్యంగా లేదని అర్థం కావడం లేదా

కొరవ 14వ పేజీలో

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com